

# విభారే తెలుగు దినపత్రిక

# VIBHARE TELUGU DAILY

ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్లగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం | స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము | ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.L.L.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787

PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 04 మార్చి 2022 సంపుటి: 03 సంచిక: 177 పేజీలు: 4 వెల: రూ 3-00

## సీఎం వైఎస్ జగన్ పర్యటన వివరాలిలా..



పశ్చిమగోదావరి: పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను ఈనెల 4వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ పరిశీలించనున్నారు. వీరి పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను బుధవారం జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ పరిశీలించారు. ప్రాజెక్టు ప్రాంతంలో స్పిల్‌వే, ఫిష్ ల్యాడర్, కాఫర్‌డ్యామ్, ఈసీఆర్ఎఫ్ ప్రాంతాలను పరిశీలించి పనులను వివరాలను సీఈ సుధాకర్‌బాబు నుంచి తెలుసుకున్నారు. అనంతరం ప్రాజెక్టు ప్రాంతంలోని మేఘ ఇంజనీరింగ్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, మేఘ ప్రతినిధులతో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై చర్చించారు. క్వాలిటీ కంట్రోల్ సీఈ ఆర్.సతీష్‌కుమార్, ఎస్ఈ శ్రీనివాసయాదవ్, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.

సీఎం పర్యటన వివరాలు ఇలా..

ఉదయం 9 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి, 10 గంటలకు తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరు 1 పునరావాస కాలనీకి చేరుకుని అక్కడ నిర్వాసితులతో మాట్లాడతారు. ఆ తర్వాత 11.20 గంటలకు పశ్చిమగోదావరి జిల్లా తాడువాయి పునరావాస కాలనీకి చేరుకుని అక్కడ నిర్వాసితులతో మాట్లాడతారు. అక్కడి నుంచి 12.30 గంటలకు పోలవరం డ్యామ్ సైట్ చేరుకుని పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు పోలవరం డ్యామ్ సైట్ నుంచి తిరిగి బయలుదేరి 5.30 గంటలకు తాడేపల్లి నివాసం చేరుకుంటారు.

సీఎం సెక్యూరిటీ పరిశీలన

సీఎం సెక్యూరిటీ బృందం సభ్యులు, జాయింట్ కలెక్టర్ అంబేడ్కర్ ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు. అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు, డీఎస్పీ కె.లతాకుమారి, తహసీల్దార్ బి.సుమతి, ఎస్సై ఆర్.శ్రీను, ఈఈ పి.ఆదిరెడ్డి ఉన్నారు.

చల్లవారిగూడెం పునరావాస కాలనీలో..

జంగారెడ్డిగూడెం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ ఈనెల 4న చల్లవారిగూడెం పునరావాస కాలనీ సందర్శనలో భాగంగా ఏర్పాట్లను బుధవారం చింతలపూడి, పోలవరం ఎమ్మెల్యేలు వీఆర్ ఎలీజా, తెల్లం బాలరాజు, ఏఎస్పీ కృష్ణంరాజు పరిశీలించా రు. ఎటువంటి ఇబ్బందులు, అసౌకర్యాలు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఎమ్మెల్యేలు సూచించారు. ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, పట్టణ అధ్యక్షుడు పీపీఎన్ చంద్రరావు ఉన్నారు.

## సెమీకండక్టర్ రంగంలో స్వయంసమృద్ధి సాధించాలి : మోదీ

న్యూఢిల్లీ : అత్యంత ముఖ్యమైన రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం మినహా భారత దేశానికి మరొక దారి లేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. సెమీకండక్టర్లు వంటి కీలకాంశాల్లో స్వయంసమృద్ధి కోసం కృషి చేయడం వల్ల 'మేక్ ఇన్ ఇండియా' పథకం మరింత బలోపేతమవుతుందని చెప్పారు. బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పించిన నేపథ్యంలో జరిగిన వెబినార్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యాభివృద్ధి శాఖ 'ప్రపంచం కోసం మేక్ ఇన్ ఇండియా' శీర్షికతో ఈ వెబినార్‌ను నిర్వహించింది. మోదీ మాట్లాడుతూ, సెమీకండక్టర్ల విషయానికి



వచ్చేసరికి స్వయం సమృద్ధి సాధించడం మినహా భారత దేశానికి మరొక దారి లేదన్నారు. ఈ రంగం 'మేక్ ఇన్ ఇండియా'కు నూతన అవకాశాలను తీసుకొచ్చిందని చెప్పారు. మన దేశంలోని ముడి ఇనుప ఖనిజం విదేశాలకు వెళ్తోందని, నాణ్యమైన ఉక్కును మనం ఆ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. దిగుమతులు సాధ్యమైనంత తక్కువగా ఉండేవిధంగా ఇండియన్ మాన్యుఫ్యాక్చరర్స్ కృషి చేయాలని, ఇతర దేశాలపై ఆధాపడవలసిన అవసరాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. భారత దేశం వంటి అతి పెద్ద దేశం కేవలం మార్కెట్‌గా మిగిలిపోతే, ఎన్నటికీ అభివృద్ధి చెందబోదని, యువతకు ఉపాధి అవకాశాలను కల్పించడం సాధ్యం కాదని చెప్పారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలు ఏ విధంగా ధ్వంసమయ్యాయో మనం చూశామన్నారు. ప్రపంచం భారత దేశాన్ని ఓ మాన్యుఫ్యాక్చరింగ్ పవర్ హౌస్‌గా చూస్తోందని తెలిపారు. దేశ జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి)లో మాన్యుఫ్యాక్చరింగ్ రంగం వాటా 15 శాతమని, అయితే 'మేక్ ఇన్ ఇండియా'లో అనంతరమైన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మాన్యుఫ్యాక్చరింగ్ బేస్‌ను బలోపేతం చేయడానికి మనమంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## సీఆర్డీఏ చట్టం రద్దు కుదరదు

### మూడు రాజధానుల బిల్లు పై కోర్టు ఆర్డర్

విజయవాడ, మార్చి 3, (న్యూస్ పల్స్)మూడు రాజధానులు, అఖీఅం రద్దు పిటిషన్లపై ఏపీ హైకోర్ట్ కీలక తీర్పు వెల్లడించింది. సీఆర్డీఏ చట్ట ప్రకారమే ప్రభుత్వం ముందుకెళ్లాలని స్పష్టం చేసింది. రైతులతో చేసుకున్న అగ్రిమెంట్ ప్రకారం ఆరు నెలల్లో మాస్టర్ ప్లాన్ పూర్తి చేయాలని పేర్కొంది. 3 రాజధానులు, సీఆర్డీఏ రద్దు పిటిషన్లపై ఏపీ హైకోర్టు తీర్పు వెలువరించింది. సీఆర్‌డీఏ చట్ట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలి. 3 నెలల్లో ప్లాన్‌ను పూర్తిచేయాలని హైకోర్టు ఒప్పందం ప్రకారం 6 నెలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశించింది. భూములిచ్చిన రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అప్పగించాలని, 3 నెలల్లో అన్ని సౌకర్యాలతో అభివృద్ధి పరిచిన ప్లాట్లు ఇవ్వాలంది. అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు కోర్టుకు నివేదిక ఇవ్వాలని, రాజధాని అవసరాలకు తప్ప ఇతర అవసరాలకు భూమి తనఖాకు వీల్లేదని కోర్టు వెల్లడించింది. రాజధానులు, సీఆర్డీఏ రద్దు పిటిషన్లపై హైకోర్టు తీర్పునిచ్చింది. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని, 3 నెలల్లోపు వాటాదారులకు ప్లాట్లు నిర్ణయించాలంది. 6 నెలల్లోపు ప్లాట్లకు మౌలిక సదుపాయాలు




పూర్తిచేయాలి. ఉన్నది ఉన్నట్లుగా మాస్టర్‌ప్లాన్ ప్రకారం అభివృద్ధి చేయాలంది. రాజధానిపై ఎలాంటి చట్టాలు చేసే అధికారం అసెంబ్లీకి లేదని పేర్కొంది ఏపీ హైకోర్ట్.కొంతమంది న్యాయమూర్తులు ఈ కేసులు విచారించొద్దన్న పిటిషన్‌ను కొట్టివేసింది కోర్టు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్ర నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పు వెలువరించింది. అభివృద్ధి పనులపై ఎప్పటికప్పుడు నివేదికను హైకోర్టు తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. భూములు ఇచ్చిన రైతులకు 3 నెలల్లో అన్ని సౌకర్యాలతో అభివృద్ధి పరిచిన ప్లాట్లను అప్పగించాలని.. రాజధాని అవసరాలకు తప్ప ఇతరత్రా వాటికి? ఆ భూములను తనఖా పెట్టడానికి వీల్లేదని స్పష్టం చేసింది.అమరావతి నుంచి ఏ కార్యాలయాన్నీ తరలించొద్దని స్పష్టం చేసింది. అమరావతిని రాజధానిగా అభివృద్ధి చేయాలని ఆదేశించింది. మూడు నెలల్లోపు వాటాదారులకు ప్లాట్లు నిర్ణయించాలనె సూచించింది. ఆరునెలల్లోపు ప్లాట్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. మాస్టర్ ప్లాన్‌లో ఉన్నది ఉన్నట్లు అమలు చేయాలని పేర్కొంది. రాజధానిపై ఎలాంటి చట్టాలు చేసే అధికారం అసెంబ్లీకి లేదని. అమరావతి నుంచి ఏ కార్యాలయాన్నీ తరలించకూడదని ఆదేశించింది. పిటిషనర్లందరికీ ఖర్చుల కింద రూ.50వేలు చెల్లించాలని హైకోర్టు ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## సీఆర్‌డీఏ చట్టం అమలులోనే ఉంది: మంత్రి బొత్స



విజయవాడ: మూడు రాజధానుల బిల్లును ఉపసంహరించుకున్నామని.. సీఆర్‌డీఏ చట్టం అమలులోనే ఉందని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, "అసెంబ్లీ, పార్లమెంట్ ఉన్నదే చట్టాలు చేయడానికి.. రాజ్యాంగం ఇచ్చిన హక్కు. మా ప్రభుత్వం విధానం మూడు రాజధానులు. మేం సమాజ అభివృద్ధి కోసం ఆలోచిస్తున్నాం. టీడీపీ తన సామాజిక అభివృద్ధి కోసం ఆలోచిస్తోందని" మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు.

## 'అమరావతి.. చంద్రబాబు పెట్టుబడుల రాజధాని'

### వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్



విశాఖపట్నం: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి టీడీపీకి అవసరం లేదని మండిపడ్డారు. "ఉత్తరాంధ్రపై చంద్రబాబుకు ద్వేషం ఎందుకు?. గతంలో టీడీపీ అధికారంలోకి రావడంలో ఉత్తరాంధ్రదే కీలక పాత్ర. అమరావతి.. చంద్రబాబు పెట్టుబడుల రాజధాని. సీఆర్‌డీఏ అంటే చంద్రబాబు రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్ అథారిటీ" అంటూ గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. "రాష్ట్రంలో అన్ని జిల్లాలనూ అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం. విశాఖ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. ఎల్లో మీడియా అవాస్తవ కథనాలు ప్రచారం చేస్తోంది. రామోజీరావు తన వ్యాపారాలు విశాఖ నుంచే మొదలుపెట్టారు. విశాఖ మునిగిపోతుందంటూ రాధాకృష్ణ జ్యోతిష్యం చెబుతున్నారు. విశాఖ మీద ఎందుకు విషం చిమ్ముతున్నారంటూ" ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్ నిప్పులు చెరిగారు.

## 'అమరావతి రైతులని చంద్రబాబే నట్టేట ముంచారు'

విజయవాడ: అమరావతి రైతులను చంద్రబాబు నాయుడే నట్టేట ముంచారని దేవాదాయ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ విమర్శించారు. అమరావతిని భ్రమరావతిని చేసింది చంద్రబాబేనని మండిపడ్డారు. అమరావతిలో నాలుగు బిల్డింగ్‌లు కట్టి, రాజధానిగా చంద్రబాబు ప్రచారం చేశారని, గత టీడీపీ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ మాఫియాతో కుమ్మక్కై దోచుకుందన్నారు. మీడియాతో మాట్లాడిన వెల్లంపల్లి.. 'రియల్ ఎస్టేట్ మాఫియాకి సహకరించేలా గత ప్రభుత్వం సీఆర్డీఏ చట్టాన్ని రూపొందించింది. సీఆర్‌డీఏ చట్టానికి కూడా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ లో మళ్లీ సమస్యలు రాకుండా అన్ని ప్రాంతాలని సమానంగా అభివృద్ధి చేయాలని సీఎం వైఎస్ జగన్ భావిస్తున్నారు. గతంలో అభివృద్ధి ఒక్క హైదరాబాద్‌కే పరిమితమైంది. అన్ని జిల్లాలు.. అన్నిప్రాంతాలని అభివృద్ధి చేయాలనేది సీఎం వైఎస్ జగన్ ఆలోచన. రైతులకి అన్యాయం జరగనివ్వమని మొదట నుంచి మా ప్రభుత్వం చెబుతోంది. రాజధాని విషయంలో చంద్రబాబు ప్రజలను మోసం చేశారు. అమరావతిని అభివృద్ధి చేయకుండా చంద్రబాబు కాలయాపన చేశారు' అని పేర్కొన్నారు.



## అమరావతి రాజధానికి బీజేపీ కట్టుబడి ఉంది: పురంధేశ్వరి

విజయవాడ: అమరావతి రాజధానిపై హైకోర్ట్ ఇచ్చిన తీర్పును బీజేపీ స్వాగతిస్తుందని



కేంద్ర మాజీ మంత్రి పురంధేశ్వరి తెలిపారు. అమరావతి రాజధానికి బిజెపి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అమరావతే రాజధానిగా వేల కోట్ల రూపాయలను కేంద్రం నిధులు కేటాయించిందన్నారు. తీర్పు ప్రకారం రైతులకు భూములను అభివృద్ధి చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం రాజధాని భూములను తాకట్టు పెట్టుకుంటుందని విమర్శించారు. కోర్ట్ దానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని పురంధేశ్వరి అన్నారు.

## చరిత్ర హీనుడిగా జగన్.. ఈ విజయం 5 కోట్ల మంది ప్రజలది: చంద్రబాబు



అమరావతి: ఎప్పటికైనా ధర్మం, న్యాయం గెలుస్తుందని అమరావతి ఉద్యమాన్ని చూస్తే అర్థం అవుతుందని టీడీపీ అధినేత, ఏపీ ప్రతిపక్ష నేత చంద్రబాబు అన్నారు. రాజధాని అమరావతిపై కోర్టును తీర్పును ఆయన స్వాగతించారు. రాజధాని విషయంలో ఎందుకు మాట తప్పాడో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ తాడేపల్లిలో ఇల్లు కట్టుకున్నాడని, రాజధాని ఇక్కడే అన్నారని, 3 క్యాపిటల్ అని ఇప్పుడు మూడు ముక్కల ఆట మొదలు పెట్టాడని చంద్రబాబు గుర్తు చేశారు. పశువులు కూడా వీళ్లతో పోల్చితే ఒప్పుకోవని ఎద్దేవా చేశారు. రాజధానిలో ఒకే వర్గం అని తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. ముంపు లేని చోట ముంపు అని ప్రచారం చేశారని, కృష్ణానది పక్కన ఉండే భూమిని శ్మశానం అన్నారని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి దుర్మార్గులు ఉ ంటారని పక్కగా సీఆర్డీఏ చట్టం చేశామని చెప్పారు. 807 రోజులు రైతులు ఆందోళన చేస్తే అవమానించారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. "మహిళా రైతులు వీరోచితంగా పోరాడారు. పాదయాత్రకు వెళ్ళిన రైతులను ఎంత ఇబ్బందులు పెట్టారో అంతా చూశాం. అంతిమంగా ధర్మమే గెలుస్తుందని అమరావతి పోరాటం చాటింది. తప్పుడు నిర్ణయాలతో జగన్ చరిత్ర హీనునుడిగా మిగిలిపోతారు. ఈ రోజు కోర్టు ద్వారా వచ్చిన విజయం 5 కోట్ల తెలుగు ప్రజలది.

## ఏపీ ఇంటర్ పరీక్షల కొత్త షెడ్యూల్

విజయవాడ, మార్చి 3, (న్యూస్ పల్స్)ఏపీ ఇంటర్ పరీక్షల కొత్త షెడ్యూల్‌ను విద్యాశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ విడుదల చేశారు. జేఈఈ మెయిన్స్ పరీక్షల కారణంగా ఇంటర్ ఎగ్జామ్స్‌ను పోస్ట్‌పోన్ చేశామని ఆయన అన్నారు. ఇక రిలీజ్ చేసిన కొత్త షెడ్యూల్ ప్రకారం.. రాష్ట్రంలో ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలు ఏప్రిల్ 22 నుంచి మే 12 తేదీ వరకు జరగనున్నాయి. ఫస్టియర్ పరీక్షలు ఏప్రిల్ 22, 25, 27, 29, మే 2, 6, 9, 11 తేదీల్లో జరగనుండగా.. సెకండియర్ పరీక్షలు ఏప్రిల్ 23, 26, 28, 30, మే 05, 07, 10, 12 తేదీల్లో నిర్వహించనున్నారు. ఇక ప్రాక్టికల్ పరీక్షలు మాత్రం గతంలో ప్రకటించినట్టుగానే మార్చి 11 తేదీ నుంచి మార్చి 31 వరకు జరగనున్నాయి. కోవిడ్ ప్రోటోకాల్ ప్రకారం పరీక్షలను నిర్వహిస్తామని మంత్రి ఆదిమూలపు సురేష్ వెల్లడించారు. ఇంటర్ బోర్డు తరపున అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. మొత్తం 1400 కేంద్రాలలో పరీక్షలు జరగనుండగా.. ల్యాబ్ ఎగ్జామ్స్ 900 కేంద్రాల్లో జరుగుతాయి.



# సంపాదకీయం

శుక్రవారం 04 మార్చి 2022

## ఆంక్షలతో పుతిన్ ఒంటరా..

అనుకున్నది ఒకటి జరుగుతున్నది మరొకటిగా తయారయింది రష్యా అధ్యక్షుడు పుతిన్ పరిస్థితి. ప్రపంచాన్ని శాసించాలనుకున్నాడు. ఆ ప్రపంచమే పుతిన్‌ను వెలివేసే పరిస్థితి స్వయంగా తెచ్చుకున్నాడు. ఇప్పుడు కాలు వెనక్కు తీసుకునే పరిస్థితి లేదు. వెనక్కు తీసుకుంటే ఇప్పటి వరకూ తాను సంపాదించుకున్న పేరు, ప్రతిష్ట మంటగలిసిపోతాయి. అందుకే ప్రపంచ దేశాలను భయపెట్టేందుకు అణ్వాయుధాలు అంటూ హెచ్చరిక జారీ చేశాడు. పుతిన్ గురించి తెలిసిన వారెవ్వరికీ ఇప్పుడు జరుగుతున్న సంఘటనలు పెద్దగా ఆశ్చర్యపర్చవు. అమెరికా తర్వాత రష్యాను అత్యంత శక్తివంతమైన దేశంగా నిలపాలనుకున్నాడు. చాలా వరకూ సాధించారు. పుతిన్ అంటే రష్యా. రష్యా అంటే పుతిన్ అని ప్రపంచాన్ని నమ్మించాడు. పుతిన్ లెనిన్ గ్రాండ్ లో 1952 లో జన్మించాడు. లెనిన్ గ్రాండ్ స్టేట్ యూనివర్సిటీలో లా చదివాడు. అనంతరం ఆయన సోవియట్ యూనియన్ గూఢాచారి సంస్థ అయిన కేజీబీలో నిఘా అధికారిగా పుతిన్ 16 ఏళ్లు పనిచేశారు. ఆ సమయంలోనే పుతిన్ రష్యా ఉన్నత స్థాయి నాయకులకు దగ్గరయ్యారు. రాజకీయాలపై ఆసక్తి పెరిగి 1991లో ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయల్లో చేరిపోయారు. అప్పటి అధ్యక్షుడు బోరిస్ ఎల్సిన్ కోటరీలో ముఖ్యుడయ్యారు. తక్కువ సమయంలో ఎదిగి... అతి తక్కువ కాలంలోనే పుతిన్ రాజకీయంగా ఎదిగాడు. 1999 డిసెంబరు 31న రష్యా ప్రధానిగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆయన తన స్థానాన్ని వదిలం చేసుకోవడం కోసమే ప్రయత్నించారు. ప్రధాని లేదా అధ్యక్షుడు ఈ రెండు పదవుల్లోనే ఆయన ఉంటూ వస్తున్నారు. 2000 - 2004 వరకూ అధ్యక్షుడిగాను, 2004 -2008 వరకూ రెండోసారి అధ్యక్షుడిగానూ ఎనిమిదేళ్లు పనిచేశారు. తిరిగి 2008 - 2012 వరకూ రెండోసారి ప్రధానిగా పనిచేశారు. తర్వాతా 2012 - 2018 వరకూ మూడోసారి పుతిన్ రష్యా అధ్యక్షుడయ్యాడు. 2018 తర్వాత రాజ్యాంగాన్ని మార్చి తానే శాశ్వత అధ్యక్షుడిగా పుతిన్ ప్రకటించుకున్నారు. అంటే 36 ఏళ్ల పాటు పుతిన్ రష్యా అధ్యక్షుడిగా ఉంటారు. అయితే పుతిన్ ఆర్థికంగా చితికిపోయిన రష్యాను బలోపేతం చేశాడు. అమెరికాకు దీటుగా రష్యాను నిలబెట్టాడు. అమెరికాను తన శత్రువుగా చూడటం మొదలుపెట్టాడు. అదే రష్యన్లలో ఆయనకు పేరు తెచ్చి పెట్టింది. రాజకీయంగా తన ప్రత్యర్థులను పూర్తిగా అణగదొక్కాడు. తన బలమైన ప్రత్యర్థి అలెక్సీ నవల్నీకి చుక్కలు చూపించారు. స్టాలిన్ తర్వాత సుదీర్ఘకాలం పదవిలో కొనసాగిన రికార్డును అధిగమించనున్నారు. స్టాలిన్, కృశ్చేవ్, బ్రెజ్నేవ్ వంటి నేతలకు సమానంగా పేరు తెచ్చుకోవాలన్నది పుతిన్ ఆకాంక్ష. ఆ దిశగా కొంత సక్సెస్ అయినా నియంతగా ముద్రపడ్డారు.. అంతర్జాతీయంగా అమెరికాను నిలువరించడంలో పుతిన్ సక్సెస్ అయ్యారు. ఉక్రెయిన్ నుంచి క్రిమియాను స్వాధీనం చేసుకోవడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. సిరియాలో అమెరికా జోక్యానికి అడ్డుకట్ట వేసి పాత సోవియట్ యూనియన్ ప్రజలకు గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ఉక్రెయిన్ యుద్ధంతో సొంత దేశంలోనే ఆయన పై నిరసనలు మొదలయ్యాయి. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఆర్థిక పరిస్థి?తి యుద్ధంతో మరింత దిగజారింది. ద్రవ్యోల్బణంతో ధరలు పెరిగాయి. అన్ని దేశాల ఆంక్షలు విధించడంతో ప్రజలు కూడా ఇబ్బందులు పడక తప్పదు. ఉక్రెయిన్ తో యుద్ధంతో పుతిన్ ఇప్పుడు అంతర్జాతీయంగా ఒంటరి వాడయ్యాడని చెప్పాలి. దీని నుంచి బయటపడేందుకు ఎన్నేళ్లు పడుతుందో చెప్పలేని పరిస్థితి.

# అమరావతే రాజధాని



విజయవాడ, మార్చి 3,ఎవరు అవునన్నా.. ఎవరు కాదన్నా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతే..! సీఎం జగన్ రెడ్డి, ఆయన వందిమాగధులు ఎంతలా రోడ్డెక్కి అమరావతి రాజధానికి వ్యతిరేకంగా కూతలు కూసినా.. అమరావతిని శ్మశానంతో పోల్చినా.. చంద్రబాబు నాయుడి హయాంలో జరిగిన నిర్మాణాలను ఎక్కడిక్కడే ఆపేసినా అమరావతే ఏపీ రాజధాని నగరం కానుంది! ఈ విషయం కేంద్రం స్పష్టం చేసింది. ఏపీ రాజధాని నగరంలో సచివాలయం నిర్మాణానికి వెయ్యి 214 కోట్ల రూపాయలు కేటాయించింది. దాంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్లు నిర్మించేందుకు మరో వెయ్యి 123 కోట్ల రూపాయలు కేటాయించడం అమరావతినే రాష్ట్ర రాజధాని అని ధ్రువీకరించినట్లయింది. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ భారీగా కేటాయింపులు చేసింది. ఈ మేరకు 2022-23 బడ్జెట్ లో ప్రత్యేకంగా ప్రొవిజన్ పెట్టడం విశేషం. ఏపీ రాజధాని ఏదో తెలియదు అన్నట్లు ఇంతవరకు వ్యవహరించిన కేంద్ర ప్రభుత్వం తాజాగా అమరావతినే రాజధానిగాపేర్కొని, భారీగా కేటాయింపులు చేయడం గమనార్హం. అంతేకాకుండా ఈ ప్రొవిజన్ నిధులను రాజధాని అమరావతిలో ఏయే పనులకు వినియోగించాలో అనే విషయంపైనా కేంద్రం పూర్తి స్పష్టత ఇచ్చింది. 2022-23 కేంద్ర బడ్జెట్ ప్రొవిజన్ ప్రకారం.. ఏపీ రాజధాని అమరావతిలో సచివాలయం నిర్మాణానికి వెయ్యి 214 కోట్లు, రాజధాని అమరావతిలో ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల నిర్మాణానికి వెయ్యి 123 కోట్ల రూపాయలు కేంద్రం కేటాయించింది. జీపీఓఏకు భూసేకరణ వ్యయాన్ని 6.63 కోట్ల రూపాయలుగా కేంద్రం అంచనా వేసింది.ఇదిలా ఉంటే.. బడ్జెట్ లో కేటాయింపుల ప్రకారంగానే నిధులు విడుదల అవుతాయనే వాదనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేటాయింపులు మాత్రమే చేసి నిధులు విడుదల చేయని సందర్భాలు గతంలో ఎన్నో ఉన్నాయని ఆర్థిక రంగ నిపుణులు ఈ సందర్భంగా గుర్తు చేస్తుండడం గమనార్హం. మరి.. రాజధాని అమరావతి నిర్మాణం కోసం అంటూ మోడీ సర్కార్ చేసిన మేరకు నిధులను విడుదల చేయించుకునే విషయంలో జగన్ రెడ్డి సర్కార్ ఎంతవరకు సఫలం అవుతుందో చూడాలని రాజకీయ, ఆర్థిక రంగ నిపుణులు అంటున్నారు. అయితే.. అమరావతి అంటే ఆముదం తాగినట్టు మొహం పెట్టే వైసీపీ సర్కార్ రాజధాని సచివాలయం, ఉద్యోగుల ఇళ్ల నిర్మాణానికి నిధుల విడుదల చేయించుకునేందుకు మనసు పెట్టి ప్రయత్నిస్తుందో లేదో వేచి చూడాల్సి ఉందని అంటున్నారు.

# గన్నవరంలో టీడీపీకి దిక్కెవరు..?

విజయవాడ, మార్చి 3,కృష్ణా జిల్లాలోని గన్నవరం నియోజకవర్గం రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు. కమ్యూనిస్టు అగ్రనేత పుచ్చలపల్లి సుందరయ్య వంటి నేతలు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం ఇది. అయితే.. మిగతా నియోజకవర్గాలన్నీ వేరు, గన్నవరం వేరు అన్నట్లు ఉన్నాయి తాజా సమికరణాలు, 2014, 19 ఎన్నికల్లో టిడిపి నుంచి వల్లభనేని వంశీ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. గడిచిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో టిడిపికి అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వచ్చారు వంశీ. తరువాత కాలంలో ఏకంగా వైసీపీకి మద్దతు ప్రకటించి సొంత పార్టీకి ఝలక్ ఇచ్చారు. అప్పటి నుంచి టిడిపి అధినేత చంద్రబాబు, టిడిపి నేతలపై తనదైన శైలిలో మాటల దాడి చేస్తున్నారు. పార్టీ విధానాలు, లోపాలపై నిర్మొహమాటంగా మాట్లాడుతున్నారు. జిల్లా మంత్రి కొడాలి నానితో కలిసి టిడిపి టార్గెట్గా విమర్శలు చేస్తున్నారు.ఇదంతా ఒక ఎత్తైతే.. టీడీపీ దారెటు అన్నది మరో ఎత్తు. వంశీ టిడిపికి దూరం కావడంతో.. ఆ పార్టీకి నాయకత్వ సమస్య ఏర్పడింది. బలమైన కేడర్ ఉన్నా సరైన నాయకుడు లేకపోవడంతో కేడర్‌లో నిర్లిప్తత నెలకొందన్న చర్చ నడుస్తోంది. ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడును నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా నియమించారు చంద్రబాబు. బిసి సామాజిక వర్గానికి చెందిన నేత అయిన అర్జునుడుకి వల్లభనేనిని తట్టుకునే శక్తి, చరిష్మా లేదన్నది నియోజక వర్గంలో వినిపిస్తున్న టాక్. అందుకే టీడీపీ బలమైన అభ్యర్థి కోసం అన్వేషిస్తుందట. వచ్చే ఎన్నికల్లో వంశీని ఎదుర్కొనేందుకు దీటైన అభ్యర్థి కోసం వెదుకుతుందట. సామాజికంగా, ఆర్థికంగా అన్ని విధాలుగా సమర్థుడైన నాయకుడు కావాలనే కోణంలో ఆలోచన చేస్తోందట.టీడీపీ నుంచి గన్నవరంలో పోటీచేసేది ఎవరనే కోణంలో పలువురి నేతలు పేర్లు వినిపిస్తున్నా.. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పోటీ చేస్తారన్న ప్రచారం సాగుతోంది. ఈ విషయాన్ని పార్టీ నేతలు బహిరంగంగా చెప్పకపోయినా.. గద్దె రామ్మోహన్ అయితే గెలుపు అవకాశాలు ఎక్కువని లెక్కలు వేసుకుంటున్నారు తెలుగు తమ్ముళ్లు. ఇపుడు ఉన్న ఇన్‌ఛార్జ్ నామమాత్రమే. పైగా ఆర్థికంగా ఖర్చు పెట్టే పరిస్థితి లేదంటున్నారు. అయితే గద్దె తూర్పు నియోజకవర్గం వదిలి వెళతారా? అంటే ఇదో క్వశ్చన్ మార్క్‌గానే ఉంది. తూర్పు నియోజకవర్గంలో అతనికి మంచి పట్టుంది. అన్ని వర్గాల వారితో సత్సంబంధాలు ఉన్నాయి. అయితే రామ్మోహన్ గన్నవరం వెళ్తారా అంటే.. ఆయన నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందని అంటున్నారు తమ్ముళు.. ఒకవేళ గద్దె విముఖత చూపితే.. మరో నేతను వెతుక్కోవాలి.

# వివేకా హత్య పై చర్చోపచర్చలు

కడప, మార్చి 3, (న్యూస్ పల్స్)వివేకానందరెడ్డి కుటుంబానికి ఇంత అన్యాయం జరిగిందా? బాబాయ్ కూతురు, వరుసకు చెల్లెలు అయిన సునీతారెడ్డికి జగన్ ఇంత ద్రోహం చేశాడా? ఏపీ వ్యాప్తంగా ఇప్పుడు ఎక్కడ చూసినా ఈ చర్చే జరుగుతోంది. వివేకానందరెడ్డి హత్య కేసుకు సంబంధించి సీబీఐ ముందు సునీతారెడ్డి ఇచ్చిన వాంగ్మూలం బయటికి వచ్చిన నేపథ్యంలో మున్ముందు ఇంకా ఏం జరగబోతోందనే ఆందోళన కూడా పలువురి నుంచి వ్యక్తం అవుతోంది. వివేకానందరెడ్డి దారుణ హత్య వెనుక ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి హస్తం తప్పకుండా ఉండి ఉంటుందనే అనుమానాన్ని సునీత తన వాంగ్మూలంలో చెప్పారు. ఆ తర్వాత సునీత భర్త రాజశేఖర్ రెడ్డి సీబీఐకి ఇచ్చిన వాంగ్మూలంలో రాజకీయంగా లబ్ధిపొందేందుకు వైఎస్ వివేకా హత్యకు జగన్ రెడ్డి ప్లాన్ వేసి ఉంటారని కూడా చెప్పారు.దీంతో ఒక్కసారిగా ప్రభుత్వ సలహాదారు, వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి బుల్లితెర మీద ప్రత్యక్షం అయిపోయారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆడుతున్న నాటకంలో వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్ రెడ్డి పావులుగా మారిపోయారంటూ బట్ట కాల్చి ముఖం మీద వేసేశారు. బాబాయ్ హంతకులెవరో తేల్చే పని చూడకుండా బ్లేమ్ గేమ్ మొదలెట్టేశారు. తన తండ్రిని అవినాష్ రెడ్డి చంపాడని తాను అనుమానిస్తున్న కారణంగానే జగన్ భార్య భారతి తనను దూరం పెట్టేసినట్లు వివేకా కుమార్తె సునీత అంటున్నారు.నిజంగా వైఎస్ వివేకానందరెడ్డిని చంద్రబాబు లేదా, సునీత చంపించి ఉంటే మీరెందుకు నేర ఘటనా స్థలంలో రక్తం తుడిచారో జవాబు చెప్పాలని టీడీపీ నేతలు ప్రశ్నిస్తున్నారు. నిజంగా చంద్రబాబు లేద సునీతే వివేకాను చంపించి ఉంటే.. ఆయన శరీరంపై గాయాలకు మీరెందుకు కట్లు కట్టారని నిలదీస్తున్నారు. ఒక వేళ వివేకాను చంద్రబాబు లేదా సునీత చంపితే మీరెందుకు గుండెపోటు అని ప్రచారం చేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు.సజ్జల చేసిన బ్లేమ్ గేమ్ పై పలువురు టీడీపీ నేతలు ట్విట్టర్ వేదికగా విరుచుకుపడ్డారు. ఇప్పుడు వివేకా కుమార్తె సునీతను 'పావు' అని ఆరోపించిన సజ్జల రామకృష్ణారెడ్డి రేపు జగన్మోహన్ రెడ్డి కన్న తల్లి విజయమ్మ, తోడబుట్టిన వైఎస్ షర్మిల కూడా చంద్రబాబుకు పావులుగా మారారని అంటారేమో అని టీడీపీ సీనియర్ నేత చింతకాయల అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యానించారు. సజ్జల లాంటి నీచమైన క్యారెక్టర్ పురాణాల్లో కూడా ఉండదన్నారు. రేపు వైఎస్ విజయమ్మ, షర్మిల కూడా చంద్రబాబు పావులు అంటారేమో అని అనుమానం వ్యక్తం చేశారు.'ఏమిటి సజ్జలా.. వివేకా ఆత్మ క్షోభిస్తుందా? క్షోభించదా మరి.. అబ్బాయిలు వేసేస్తే ఏ బాబాయి ఆత్మ అయినా క్షోభిస్తుంది' అని మాజీ మంత్రి కేఎస్ జవహర్ ట్వీట్ చేశారు. 'ఆ రోజు వివేకా హత్యను చంద్రబాబే చేయించారని చెప్పడానికి లేని సిగ్గు.. ఈ రోజు సునీత జగనాసుర రక్త చరిత్ర బయటపెడితే వచ్చిందా?' అంటూ సజ్జల రామకృష్ణారెడ్డిని దెప్పిపొడుస్తూ బుద్దా వెంకన్న ట్విట్టర్ వేదికగా పోస్టు పెట్టారు. 'సిగ్గులు.. ఎగ్గుల గురించి సజ్జల.. ఆయన వెనుక ఉన్న జగన్ రెడ్డి మాట్లాడితే ఆశ్చర్యంగా ఉంది. సునీత తన తండ్రి హత్య విషయంలో ఉన్న అనుమానాలు సీబీఐకి చెబితే జగన్ అండ్ కో తట్టుకోలేకపోతున్నారు' అని బీటెక్ రవి ట్వీట్ చేశారు. 'అయ్యా.. అవినాష్ రెడ్డి వీళ్లు ఎంత ఉన్మాదులో చూశావుగా.. ఇంటి ఆడబిడ్డ సునీతను కూడా ఈ రోజు చంద్రబాబు పావు అన్నారు. రేపు నిన్ను ఏసేసినా ఏసేస్తారు. సీబీఐ వద్దకెళ్లి నిజం ఒప్పుకో' అంటూ అమర్ నాథ్ రెడ్డి ట్విట్టర్ వేదిక తెలిపారు. దోషులను కాపాడాలని, సునీతను బలిచేయాలని సీఎం జగన్ కుట్ర చేస్తున్నారని టీడీపీ సీనియర్ నేత బోండా ఉమ దుయ్యబట్టారు. వివేకా హత్య కేసులో అవినాష్ రెడ్డిని కాపాడేందుకు జగన్ అన్ని విధాలా ప్రయత్నిస్తున్నారని కాల్వ శ్రీనివాసులు ఆరోపించారు. వివేకా హత్యతో జగన్ రాజకీయంగా లబ్ధి పొందారని, వివేకా హత్యకు కుటుంబ సభ్యులే కుట్ర చేశారంటే ఎవరి ప్రమేయం ఉందో తేల్చాలని అన్నారు.మొత్తం మీద దివంగత వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె, అల్లుడిపై సజ్జల రామకృష్ణా రెడ్డి చేసి ఆరోపణలపై టీడీపీ నేతలు ఒక్కసారిగా మీడియా.. సోషల్ మీడియా వేదికగా ఎదురుదాడి కొనసాగిస్తున్నారు.

# ఎంపీలతో ఒరిగిందేమిటీ....

విశాఖపట్టణం, మార్చి 3, (న్యూస్ పల్స్)జాతీయ రాజకీయాల్లో విశాఖ జిల్లా ఒకప్పుడు చాలా యాక్టివ్.. జిల్లాకు చెందిన పార్లమెంట్ సభ్యులైతే శక్తివంతులు. దమ్మున్నోళ్లు. వారు కనుసన్నల్లోనే అప్పట్లో రాజకీయాలు జరిగేవి అంటే అతిశయోక్తి కాదు. గతంలో ఎంపీలు నేదురుమల్లి జనార్దన్ రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ద్రోణంరాజు సత్యనారాయణ, సబ్బం హరి, పురందేశ్వరి, కంభంపాటి హరిబాబు వంటి వారు ఢిల్లీలో చక్రం తిప్పారు. ప్రజా సమస్యలపై గళం విప్పడంలోనూ.. అభివృద్ధి పనుల కోసం ప్రయత్నించడంలోనూ తమదైన ముద్రను వారు వేశారు. ఇదంతా గతం.ఇక వర్తమానంలోకి వస్తే.. విశాఖ జిల్లాలోని ఎంపీలు జాతీయ స్థాయిలో తమదైన ముద్ర వేయలేక చతికిలపడిపోతున్నారనే విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుత వైసీపీ పార్లమెంట్ సభ్యులు క్రియాశీలకంగా లేరని జిల్లా ప్రజలు పెదవి విరుస్తున్నారు. వైజాగ్ జిల్లాకు చెందిన వైఎస్సార్సీపీ ఎంపీలు జాతీయ రాజకీయాల్లోనే కాదు స్థానికంగా కూడా తమదైన ముద్ర ఏమాత్రం వేయలేకపోతున్నారని అంటున్నారు. తాము గెలిచిన సొంత పార్టీ ఎమ్మెల్యేలే ఎంపీలను ఖాతరు చేయడం లేదంటున్నారు. విశాఖ జిల్లా నుంచి ఎన్నికైన ప్రస్తుత వైసీపీ ఎంపీలు ఎవరూ ప్రజలకు తెలియకపోవడమే పెద్ద సమస్య. వీరికి ఏమాత్రం జనాదరణ లేదు. వైఎస్ జగన్ రెడ్డి మీద ఉన్న అభిమానంతో విశాఖ జిల్లా ప్రజలు వారికి ఓటు వేసి పార్లమెంట్ సభ్యులుగా గెలిపించారు. అయితే.. వారు ప్రజలతో సంబంధాలు కొనసాగించడం లేదట. తమ తమ నియోజకవర్గాల్లో ఏనాడూ పర్యటించడం లేదు. ఎక్కువగా తమ సొంత పనుల కోసమే సమయం వెచ్చిస్తున్నారట.విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి ఈ మూడేళ్లలో లోక్ సభలో ఏనాడూ నోరు విప్పిన పాపాన పోలేదు. సభకు వెళ్లడం.. మౌన మునుల్లాగా కూర్చుంటున్నారనే ఆరోపణ ఉంది. తమ నియోజకవర్గాలు, పార్టీ వేదికల్లో అయినా ఏమైనా మాట్లాడతారా..? అంటే మౌనమే వారి భాషగా ఉంటోంది. ఎంవీవీ సత్యనారాయణ, మాధవి ఇద్దరూ రాజకీయాల్లోకి కొత్తగా వచ్చారు. తొలిసారిగా పార్లమెంట్‌కు ఎన్నికయ్యారు. అయితే.. చాలాకాలంగా రాజకీయాల్లో ఉన్న భీశెట్టి సత్యవతి కూడా మొదటిసారి లోక్ సభకు ఎన్నికయ్యారు.వైజాగ్ రైల్వే జోన్ సమస్య,ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం ఇతర సమస్యలపైన కూడా వారు చొరవ చూపడం లేదనే విమర్శ ఉంది. విశాఖకు గుర్తింపు తెచ్చింది కీలకమైన స్టీల్ ప్లాంట్. ఐదు లక్షల మంది జీవితాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రభావితం చేస్తుంది ఇది. ఇప్పుడు ఈ పరిశ్రమపై ప్రైవేటీకరణ కత్తి వేలాడుతోంది. స్థానిక ఎంపీలైన ఈ ముగ్గురూ ఉద్యమానికి సంఘీభావం ప్రకటించడమో.. మంత్రులను కలిశామని చెప్పడానికో పరిమితం అవుతున్నారే గానీ గట్టిగా పట్టుబట్టి పార్లమెంటులో నిలదీసే సాహసం చేయడంలేదని విమర్శలు ఉన్నాయి.విశాఖ ఎంపీ ఎంవి సత్యనారాయణ-స్థానిక ఎమ్మెల్యేల మధ్య సయోధ్య లేదట. సొంత వ్యాపారాలకే ఆయన పరిమితమయ్యారు. ఉత్తరాంధ్రకు చెందిన వైసీపీకి ప్రముఖ నాయకుడితో ఎంవీ సత్యనారాయణకు సమస్యలు ఉండడంతో ఆయన వ్యాపారాలకే పరిమితమయ్యారంటారు. అనకాపల్లి ఎంపీ సత్యవతికి డాక్టర్ గా పెద్ద పేరుంది. అయినా ఆమె ప్రజలకు అందుబాటులో ఉండరనే ఆరోపణ ఉంది. అనకాపల్లి ఎమ్మెల్యే అమర్నాథ్ వర్గం.. సత్యవతి గ్రూప్ మధ్య విభేదాలు ఉన్నాయి. వారి మధ్య ఆధిపత్యం కోసం పోరు కొనసాగుతోంది. గొడ్డేటి మాధవి.. అరకు ఎంపీగా అత్యధిక మెజారిటీతో గెలిచారు. ఆమె ఏనాడూ సమస్యలపై ఎలుగెత్తిన దాఖలాలు లేవు. అరకు నియోజకవర్గం పేరుకు పర్యాటక ప్రాంతమైనా గిరిజనుల అగచాట్లు అన్నీఇన్నీ కావు. అరకు ఎంపీ నియోజకవర్గంలో కూడా గ్రూపుల గోల తక్కువేమీ కాదు.

# పవన్ కు టీడీపీ సపోర్ట్...

విజయవాడ, మార్చి 3, (న్యూస్ పల్స్)భీమ్లా నాయక్‌కు టీడీపీ సపోర్ట్ ఫ్యూచర్ పొత్తుకు సంకేతమా..? పవన్‌కు మద్దతుగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా తెలుగు తమ్ముళ్లు మాట్లాడటం వెనుక అసలు ఆంతర్యం ఏమిటి..? అడగకుండానే అక్కున చేర్చుకుంటున్న పసుపు పార్టీపై జనసైనికులు ఏమనుకుంటున్నారు..? రాబోయే ఎన్నికల్లో పొత్తు విషయమై తెలుగుదేశం, జనసేన పార్టీల్లో అంతర్గతంగా ఎలాంటి చర్చలు జరుగుతున్నాయి..? వీటన్నింటిపై రాజకీయ విశ్లేషకులు ఏమంటున్నారో, వారి అభిప్రాయం ఏంటో ఓ లుక్కేద్దాం..ప్రస్తుతం 'భీమ్లానాయక్'కు తెలుగుదేశం పార్టీ నుంచి అడగని అండ చాలానే దొరికిందని జనసేన నాయకులు చెవులు కొరుక్కుంటున్నారు. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవర్ స్టార్ ఏపీలోని సినిమా థియేటర్లు, టికెట్ల వ్యవహారంపై ఓ ముక్క కూడా మాట్లాడకపోయినా.. టీడీపీ నేతలు మాత్రం ప్రెస్ మీట్లు, వరుస ట్వీట్లతో హోరెత్తించారు. తాము మద్దతు కోరకపోయినా తెలుగు తమ్ముళ్ల నుంచి భీమ్లానాయక్ కు ఇంత సపోర్ట్ రావడంపై ఆశ్చర్యంలో ఉంది జనసేన శిబిరం.రాబోయే ఎన్నికల్లో తాము అధికారంలోకి రావాలంటే జనసేనతో తప్పనిసరిగా పొత్తు ఉండాల్సిందేనని టీడీపీ భావిస్తోంది. ఎందుకంటే 2019 ఎన్నికల్లో ఏం జరిగిందో అందరికీ తెలుసు. జనసేనతో పొత్తులేకుండా బరిలోకి దిగిన తెలుగుదేశం పార్టీకి పెద్ద దెబ్బే తగిలింది. ఓట్లు చీలి వైసీపీకి లాభం కలిగింది. 2024 ఎన్నికల్లో కూడా పొత్తు లేకపోతే మళ్లీ వైసీపీకే అధికారం దక్కడం ఖాయమని టీడీపీ భావించే.. జనసేనపై ప్రేమకురిపిస్తున్న అనేది టాక్.రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం గెలవాలంటే.. జనసైనికుల మద్దతు ఉండాలి. కానీ జనసేన అధిష్ఠానం మాత్రం ఇప్పటికీ పొత్తుపై పెదవి విప్పడంలేదు. టీడీపీ రమ్మంటున్నా.. జనసేన చూద్దాం అనే ధోరణి ప్రదర్శిస్తోంది. పైగా తమ పార్టీ పరిస్థితి గతంతో పోలిస్తే మెరుగుపడిందని భావిస్తోంది. ఎందుకంటే గత రెండేళ్లుగా క్యాడర్‌ను పెంచుకోవడపై జనసేన అధిష్ఠానం ప్రధానంగా దృష్టి పెట్టింది. అభిమానులు ఉన్నారు కాని ఓట్లు వేయడంలే, చూడటానికి వస్తున్నారు కాని ఎన్నికల్లో సైడైపోతున్నారు. ఈ లోపాన్ని సరిచేసుకునే పనిలో ఉంది పవన్ పార్టీ. విస్తృతంగా సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, క్యాడర్ పెంచుకునే పనులు చేస్తోంది.మరోవైపు 2019 ఎన్నికల టైమ్‌తో పోలిస్తే జనసేన ఇప్పుడు బలపడిందని టీడీపీ కూడా భావిస్తోంది. ఇది తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తోందని కూడా అంటున్నారు. అందుకే పవన్ కళ్యాణ్‌ను టీడీపీ నేతలు సందు దొరికినప్పుడల్లా ఆకాశానికి ఎత్తేస్తున్నారు. భీమ్లానాయక్ సినిమా రిలీజ్ టైంలో కూడా ఇదే జరిగింది. ఎలాగూ జనసైనికులు, పవన్ అభిమానులు సినిమా విషయంపై ప్రభుత్వంతో ఫైట్ చేస్తున్నారు. ఇప్పుడు ఈ సినిమాకు మద్దతు పలకడం ద్వారా తమపై మంచి అభిప్రాయం జనసైనికుల్లో కలగాలని స్కెచ్ వేసినట్టుంది తెలుగుదేశం. అందుకే ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తూ పవన్ కళ్యాణ్‌కు మద్దతు పలికారని భావిస్తున్నారు.మొత్తానికి రాబోయే ఎన్నికల్లో పొత్తుపై టీడీపీ నేరుగా పచ్చజెండా ఊపేస్తే.. జనసేన మాత్రం అంతర్గతంగా ఆలోచనలు చేస్తోంది. త్వరలో జరగబోయే జనసేన ఆవిర్భావ దినోత్సవంలో ఫ్యూచర్ పొత్తులపై జనసేనాని పవర్ స్టార్ ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

# మాజీలకు మంచి డిమాండ్...

విశాఖపట్టణం, మార్చి 3, ఆయన చిరంజీవి ప్రజారాజ్యం ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన నేత. రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి టీడీపీలో విశాఖ రూరల్ జిల్లా ప్రెసిడెంట్ గా కూడా పనిచేసిన కీలక నేత. విశాఖ రాజధాని కోసం టీడీపీకి, పార్టీ పదవికి రాజీనామా చేసి వైసీపీలో చేరారు. సీనియర్ నేతగా ఉన్న పంచకర్ల రమేష్ బాబు విశాఖ జిల్లాలో బలమైన కాపు సామాజికవర్గం నేతగా ఉన్నారు. ఆయన మృదు స్వభావి. పైగా పారిశ్రామికవేత్త. చిత్తశుద్ధితో పార్టీ అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తారు అన్న ముద్ర ఆయన మీద ఉంది. అందుకే జగన్ మెచ్చి మరీ పార్టీ కండువా కప్పారు.విశాఖ జిల్లా రాజకీయాన్ని పూర్తిగా ఒడిసిపట్టాలని భావిస్తున్న జగన్ మొత్తం సామాజిక వర్గాలను పార్టీ వైపుగా తిప్పుకోవాలని చూస్తున్నారు. ఇప్పటికే విశాఖ మేయర్ యాదవులకు కేటాయించిన జగన్ మంత్రి పదవిని కాపు సామాజిక వర్గానికి చెందిన అవంతి శ్రీనివాసరావుకు ఇచ్చారు. అదే కోవలో విశాఖ జిల్లా అధ్యక్ష పదవిని పంచకర్ల రమేష్ బాబుకు ఇవ్వాలనుకుంటున్నారు. ఆయనకు ఇవ్వడం ద్వారా కాపులను ఇటు వైపుగా పూర్తిగా తిప్పుకోవాలన్నది జగన్ ఆలోచనగా ఉంది.పంచకర్ల రమేష్ బాబుని పూర్తిగా యాక్టివ్ చేయడం ద్వారా వైసీపీని విశాఖ సిటీలో బలోపేతం చేయాలన్నది జగన్ మార్క్ ప్లాన్ అంటున్నారు. ఆయన సేవలను పూర్తిగా వినియోగించుకుంటూనే తగిన సమయంలో ఆయన్ని సరైన సీట్లో పోటీకి పెట్టాలన్నది జగన్ ఆలోచనగా ఉందిట. పంచకర్ల సైతం ముఖ్యమంత్రి ఏ పదవి అప్పగించినా తాను చేస్తామని ఇప్పటికే స్పష్టం చేశారు. దాంతో ఆయనకు పార్టీ సారథిగా అవకాశం ఇస్తారని, విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం బాధ్యతలను అప్పగిస్తారని అంటున్నారు.విశాఖ పార్లమెంట్ అధ్యక్షుడు అంటే కాబోయే ఎంపీ అని కూడా అంటున్నారు. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ ని తెచ్చి విశాఖ పార్లమెంట్ అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. యాదవ సామాజికవర్గానికి చెందిన ఆయనని వచ్చే ఎన్నికల్లో ఎంపీగా బరిలోకి దింపాలనుకుంటోంది. దానికి విరుగుడుగా జగన్ కూడా కాపు కార్డుని బయటకు తీస్తున్నారు అంటున్నారు. పంచకర్లను 2024లో జరిగే ఎంపీ ఎన్నికల్లో వైసీపీ నుంచి బరిలోకి దించుతారు అన్న టాక్ ఉంది.

## మద్యం ధరలు తగ్గాయి... రండి... సర్కారీ ఆహ్వానం

విజయవాడ, మార్చి 3, అంచెల వారీగా సంపూర్ణ మద్య నిషేధం', ఇది ఎన్నికల మాట. 'మద్యం ధరలు తగ్గించాం' మస్తుగా తాగండి' ఇది ఇప్పుడు ఏపీ టూరిజం ఆధ్వర్యంలో విజయవాడలోని హరిత హారం పార్కుల్లో వెలిసిన స్వాగత తోరణాల సారాంశం. 2019 శాసన సభ ఎన్నికల సందర్భంగా వైసీపీ ఎన్నికల మేనిఫెస్టోలో, అంచెల వారీగా సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని ప్రజలకు వాగ్దానం చేసింది. అయితే, ఆ తర్వాత ఆమాటే మరిచి పోయింది. రాష్ట్రాన్ని మద్యం మత్తులో ముంచెత్తింది. మద్యంపై వచ్చిన ఆదాయంతో ఖజానా నింపుకునేందుకు, కొత్త కొత్త పాలసీలను అమలు చేస్తోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఇంకా మూడేళ్ళు కాలేదు కానీ, మద్యం పాలసీని మూడు సార్లు మార్చింది. మద్యంపై ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం మూడు రెట్ల కంటే, ఎక్కువగానే పెరిగింది. అయినా, ఇంకా ఆదాయం చాలలేదో ఏమో, ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక శాఖ' "మా బార్ లో అన్ని రకాల మద్యం ధరలు తగ్గాయి" అని హరిత పార్క్ వెలుపలా , లోపలా ఫ్లెక్సీలు పెట్టింది. పార్కు లోపలకు వెళ్ళిన వారికే కాదు, ఆ రోడ్డున వెళుతున్న వారిని కూడా ఆకర్షించేలా అందమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది.పార్కు స్వాగత ద్వారం మొదలు లోపలి వరకు అడుగడుగున ఈ బోర్డులే కనిపిస్తున్నాయి.పర్యాటక ప్రదేశంగానే కాకుండా, విజయవాడ కనక దుర్గమ్మను దర్శించుకునే భక్తులు, భవానీ ఐలాండ్ కు వెళ్ళేందుకు, ఈ పార్క్ మార్గం కుండానే వెళతారు. ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకొని పార్కుకు వచ్చి బోటింగ్ ద్వారా భవానీ ఐలాండ్ కు చేరుకుంటారు. అవిధంగాను ఈ పార్కుకు ఉన్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకునే గతంలో, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్(ఏపీటీడీసీ) 'ఇక్కడ మద్యం తాగరాదు' అని బోర్డులు ఏర్పాటు చేసింది. ఇప్పుడు అదే పర్యాటక శాఖ, ఆ బోర్డులను వెలవల బోవలా, 'మా బార్ లో అన్ని రకాల మద్యం ధరలు తగ్గాయి' అని అందమైన ఫ్లెక్సీలు ఏర్పాటు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఆదాయం కోసం ఈవిధంగా అడ్డ దారులు తొక్కడం ఇదే మొదటి సారి కాదు, ఓ వంక ఇంటి పన్ను మొదలు అన్ని రకాల పన్నులు పెంచుతోంది. గడచిన రెడ్డున్నర సంవత్సరాలలోనే వైసీపీ ప్రభుత్వం ఐదు రెట్ల వరకు ఇంటి పన్నుపెంచిందని తెలుగు దేశం పార్టీ తాజాగా ఆరోపిస్తోంది. ఇంకా చిత్రంగా సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ బాధ్యతలను గ్రామ సచివాలయ ఉద్యోగులకు అప్పగించిన ప్రభుత్వం వారికి రోజు వారీ టార్గెట్లు ఫిక్స్ చేసింది. ఇప్పుడు ఇలా మందు తాగండని ప్రభుత్వమే ప్రచారం చేస్తోంది.

## ఆంధ్ర యూనివర్సిటీ వద్ద ఉద్రిక్తత

విశాఖపట్నం ఆంధ్ర యూనివర్సిటీ వద్ద ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ముందస్తు జాగ్రత్తగా పోలీసులు భారీగా మోహరించారు. ఛలో ఏయు పిలుపు నేపథ్యంలో టిడిపి కీలక నేతలు గృహ నిర్బంధం చేసారు. ఆంధ్ర యూనివర్సిటీ వీసీ ప్రసాద్ రెడ్డిని తక్షణమే రీకాల్ చేయాలని ఆందోళన కారులు డిమాండ్ చేసారు. అయితే ఛలో ఆంధ్ర యూనివర్సిటీకి పోలీసుల అనుమతి నిరాకరించారు. ముందస్తుగా నే పలు రాజకీయ పార్టీ నాయకులు, విద్యార్థి సంఘాలు నేతలు అరెస్టులు అయ్యారు. టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, విశాఖ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ హౌస్ అరెస్ట్ అయ్యారు. జనసేన నేతలు కోన తాతారావు, రామకృష్ణ, దల్లి గోవిందరెడ్డి, టి.డి.పి చెందిన పుచ్చా విజయకుమార్ , మొల్లి పెంటిరాజు, సి.పి.యం సుబ్బారావు, మాటూరి చిన్నారావులు హౌస్ అరెస్టయ్యారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం ఎదుట ఉద్రిక్తత నెలకొంది.చలో ఏయు నిరసన ర్యాలీలో పాల్గొనేందుకు వచ్చిన 54 వార్డు టిడిపి ప్రెసిడెంట్ పుట్ట కార్తిక్, 47 వ వార్డు టీడీపీ ప్రెసిడెంట్ రాజారావులను పోలీసులు అరెస్టు చేసారు జీవీఎంసీ గాంధీ విగ్రహం దగ్గరికి వస్తున్న ఆందోళన కారులను పోలీసులు వచ్చిన వారిని వచ్చినట్లు అదుపులోకి తీసుకున్నారు.

## గ్రేహౌండ్స్ జవాను ఆత్మహత్య

విశాఖ నగరంలోని పోతిన మల్లయ్య పాలెం శివశక్తి నగర్లో గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సురేష్ ఆత్మహత్య చేసుకున్నాడు. అర్ధరాత్రి తన ఇంట్లో కానిస్టేబుల్ ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సురేష్ ఆత్మహత్యకు పాల్పడే ముందు తన భార్యతో వీడియోకాల్ మాట్లాడినట్టు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న పీఎం పాలెం పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## మురికివాడ వాసుల అందోళన

విశాఖపట్నంవిశాఖపట్నం 55వ వార్డు పరిధి కంచరపాలెం మెట్టు గాంధీనగర్ స్లమ్ ను రైల్వే అధికారులు ఇచ్చిన నోటీసులు వెనక్కి తీసుకోవా లని, లేకుంటే ఉద్యమిస్తామని మురికి వాడ నివాసుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.రవి, పిఒడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి హెచ్చరించా చారు. ఈ మేరకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లా డుతూ, రైల్వే భూముల్లో నివసిస్తున్న పేదల నివాస హక్కును రైల్వే గుర్తించా లన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శ కాలకు అనుగుణంగా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన హౌసింగ్ ఫర్ ఆల్ కింద వారు నివసిస్తున్న చోటనే ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలుగా ఉనికిలో ఉన్న గాంధీనగర్ను తొలగిస్తామని నోటీసు లు ఇవ్వడం దుర్మార్గమన్నారు. కనీస సౌకర్యాలు పొందే ప్రాథమిక హక్కులు ను కాలరాస్తూ నివాసాలకు ఉన్న కరెంట్ కనెక్షన్ కట్ చేస్తామని ఎలక్ట్రి కల్ డిపార్టెంట్ నోటీసులు ఇవ్వడం అన్యాయం అన్నారు.గాంధీనగర్ పేద లు నివసిస్తున్న చోటనే పక్కా గృహా లు నిర్మించి ఇస్తామని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, జీవీఎల్ నరసింహారావు, ఎంపీ ఎంవివి సత్య నారాయణ, మాజీ ఎమ్మె ల్యేలు పి విష్ణుకుమార్ రాజు, తైనాల విజయ కుమార్ హామీ ఇచ్చారని, ఆ హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

## గౌతమ్ రెడ్డి కి ఆదాల సంప్రదాయ శ్రద్ధాంజలి

ఉదయగిరి నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి దివంగత మంత్రి గౌతమ్ రెడ్డికి సంప్రదాయ శ్రద్ధాంజలి ఘటించారు. ఉదయగిరిలోని మెరిట్స్ కళాశాలలో గురువారం జరిగిన గౌతమ్ రెడ్డి కర్మ క్రతువుల్లో పాల్గొన్నారు. ఇందులో భాగంగా గౌతమ్ రెడ్డి తండ్రి మాజీ ఎంపీ రాజమోహన్ రెడ్డి ఆయన సోదరులు పృథ్విరెడ్డి, విక్రమ్ రెడ్డి లను పరామర్శించి సానుభూతి పలికారు. గౌతమ్ రెడ్డి కుమారుడు కృష్ణార్జున రెడ్డి, తండ్రి గౌతమ్ రెడ్డికి చేస్తున్న సంప్రదాయ కర్మ క్రతువులను కాసేపు కూర్చుని చూశారు. అనంతరం గౌతం రెడ్డి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి, విజయ డైరీ ఛైర్మన్ రంగారెడ్డి, జడ్పీటిసి మల్లు సుధాకర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ స్వర్ణ వెంకయ్య, నరసింహారావు, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ...సుదీర్ఘ మౌనం.. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీ రాజమోహన్ రెడ్డి, ఆయన కుమారులు పృథ్వి రెడ్డి, విక్రమ్ రెడ్డి లను పరామర్శించేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా రాజమోహన్ రెడ్డి ఎంపీ ఆదాలను ఆహ్వానించి కూర్చోబెట్టారు.

# బురద చల్లడం తప్పు

**ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద రాజు**

నరసాపురం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాద రాజు మీడియా మాట్లాడుతూ గత నెలరోజులుగా పశ్చిమగోదావరి జిల్లా కి నరసాపురం జిల్లా కేంద్రంగా కావాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాము. భౌగోళికంగా భీమవరాన్ని జిల్లా కేంద్రంగా ప్రకటించారు. నరసాపురం జిల్లా కేంద్రం చేయడం కోసం ప్రభుత్వానికి ఒక సమగ్రమైన నివేదిక ఇచ్చాము.నరసాపురంలో అఖిల పక్షం చేసిన నిరసన ప్రభుత్వం దృష్టిలో ఉ ంది.నిన్న నరసాపురంలో కొత్తపల్లి సుబ్బారాయుడు చేసిన నిరసన జిల్లా కేంద్రం కోసం చేసింది కాదు. ఎమ్మెల్యే ప్రసాద రాజుని టార్గెట్ చేసిన నిరసన అని. నాకు నేరుగా సుబ్బారాయుడు చెప్పి ఉంటే బాగుండేది. నరసాపురం కోసం తీజీఞ పోరాటం చేసినా చేయకపోయినా నేను ఎప్పుడు నరసాపురం అభివృద్ధి కోసం పాటుపడుతున్నాను.రాజకీయ పార్టీలు నిరసన వ్యక్తం చేయడం తప్పుకాదు కానీ ఒకరిపై బురదజల్లే పని చేయడం తప్పు.రాజ్యాంగ బద్ధమైన పదవులు చేసిన సుబ్బరాయుడికి తెలియదా సెక్షన్ 30 గురించి రాష్ట్ర వ్యాప్తంగా అమలులో ఉన్న దానిని ఒక్క నరసాపురంలో పెట్టారని ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. నేను స్థానికుడిని కాదని పదేపదే అంటున్నారు. 20 సంవత్సరాలుగా నరసాపురం ప్రజల మధ్యలో ఉన్నాను నాలుగు సార్లు ఇక్కడినుండే పోటీచేసాను. జనసేన నాయకులు కూడా నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ కూడా ఇక్కడికి వచ్చారు ఆయనేందుకు మాట్లాడలేదు అని.సీఎం జగన్ మోహన్ రెడ్డిని తీసుకువచ్చి నరసాపురం అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి చూపిస్తాను అని అన్నారు.

# శ్రమదోపిడికి గురౌతున్న స్కీమ్ వర్కర్లు ఉద్యమబాట పట్టాలి

**- పనిభద్రత, కనీస వేతనాలు అమలును విస్మరించిన పాలకులు**

**- స్కీములకు సరిపడా బడ్జెట్ కేటాయించాలి**

**- ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తుల సత్యనారాయణ**

**- కలెక్టరేట్ ఎదుట ఏఐటియుసి ఆధ్వర్యంలో స్కీమ్ వర్కర్ల ధర్నా**

భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లకు పనిభద్రత కల్పించడంతోపాటు, కనీస వేతనాలు అమలు కోసం ఉద్యమాలు చేపట్టాలని ఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు నరాటి ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుత్తుల సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్కీమ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ దేశవ్యాపిత సమ్మెలో భాగంగా గురువారం సమ్మె చేపట్టన కార్మికులు కలెక్టరేట్ రోడ్డుపై బైటాయించి ధర్నా నిర్వహించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీములకు బడ్జెట్లో కోతలు పెడుతూ పథకాలను నిర్వీర్యం చేసే కుట్రలకు పాల్పడుతున్నారన్నారు. అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, ఆశా, ఎన్ హెచ్ఎం, కస్తూరిబాగాంధీ, సర్వశిక్ష అభియాన్, ఐకెపి తదితర పథకాల్లో పనిచేస్తున్న సుమారు కోటి మందిలో అత్యధికులు అట్టడుగు వర్గాలకు చెందిన మహిళలేనని సమాజసేవలో అంకిత భావంతో పనిచేస్తున్న వీరిపట్ల ప్రభుత్వాలు శ్రమకు తగ్గ ఫలితం అందించకుండా శ్రమదోపిడికి పాల్పడుతున్నారని విమర్శించారు. పెట్టుబడిదార్లకు ప్రతీ ఏటా లక్షల కోట్ల రాయితీలను చెల్లిస్తూ సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేయాలని కుట్ర చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా స్కీమ్ వర్కర్లు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మాతా శిశుమరణాలను నిరోధించడం, పౌష్టికాహార లోపాన్ని, పాఠశాలల డ్రాపౌట్లను తగ్గించడం, ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచడంలో స్కీమ్ వర్కర్ల కృషి ఎనలేనిదని, ఈ శాఖలను ప్రభుత్వ శాఖలుగా గుర్తించి మరిన్ని ఫలితాలు సాధించాలని అంతర్జాతీయ సంస్థలతోపాటు సుప్రీంకోర్టు కూడా సూచించిందని, ఈ పరిగణలోకి తీసుకోకుండా ప్రభుత్వాలు ఒంటెద్దు పోకడలు అవలంభిస్తున్నాయన్నారు. అంగన్ వాడీ సిబ్బందికి ఏడేండ్లుగా పెండింగ్ లో ఉన్న టిఏ-డిఏ బకాయిలు చెల్లించాలని, మిడ్డేమీల్స్ కార్మికులకు నెలకు రూ.12,500ల వేతనం చెల్లించాలని, పెండిగ్ బిల్లులు చెల్లించాలని, ఆశా కార్యకర్తలను ఏఎన్ఎంలుగా గుర్తించాలని, పథకాల్లో పనిచేస్తున్న కార్మికులకు రూ.22,500లు చెల్లించాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్లు చెల్లించాలని తదతర డిమాండ్ల సాధనకోసం ఏఐటియుసి నిర్వహిస్తున్న దశలవారి ఆందోళనలో స్కీమ్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం జిల్లా జేసీకి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సంఘాల జిల్లా నాయకులు గొనె మణి, స్థేనపల్లి విజయలక్ష్మి, ఇందిర, రూప, మమత, అరుణ, వేల్పుల మల్లికార్జున్, అక్కి నర్సింహారావు, పిట్టల రాంచందర్, పుప్పాల శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోనే సర్వేపల్లి కొనసాగడం పట్ల హర్షం వ్యక్తం చేసిన షెడ్యూల్ కులాలు

సర్వేపల్లి నెల్లూరుజిల్లా, సర్వేపల్లి నియోజకవర్గం,పొదలకురు మండలంలో విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి, సర్వేపల్లిని నెల్లూరు జిల్లాలోనే కొనసాగించిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి, కృషి చేసిన ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డికి కృతజ్ఞత అభివందనాలు తెలియజేశారు. సర్వేపల్లి నియోజకవర్గం నెల్లూరు జిల్లా లోనే అంతర్భాగంగా ఉంచడం ఒక చారిత్రాత్మకమైన నిర్ణయం అన్నారు.ముఖ్యంగా మా నిరుపేద కుటుంబాలకు చెందిన షెడ్యూల్డ్ కులాల వారికి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన ఈ నిర్ణయాన్ని ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కి మేము ఎప్పటికీ రుణపడి ఉంటాం అని తెలిపారు.ఈ గొప్ప కార్యాన్ని ముఖ్యమంత్రి కి దృష్టికి తీసుకెళ్లి ఆయన ఒప్పించి సర్వేపల్లి ఈ పండుగను తీసుకువచ్చిన ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి కి కూడా మేము ఎప్పటికీ రుణపడి ఉంటాం అన్నారు.చెప్పేది ఒకటి చేసేది ఒకటి కాకుండా ఇచ్చిన మాటకు కట్టుబడి మా కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు తీసుకొచ్చిన జగనన్న మా అందరి తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.కులము మతము కాదు సామాజిక సమతుల్యత ప్రాతిపదికగా ప్రతి కార్యక్రమంలోనూ మాకు సమాన ప్రాతినిధ్యం వహిస్తూ మా గౌరవాన్ని ఇనుమడింప చేస్తూ నా మన గోవర్ధన అన్న కూడా హృదయపూర్వక కృతజ్ఞతలు .ఏ సమస్య వచ్చినా మనలో ఎవరు జిల్లా కేంద్రానికి వెళ్లి పనులు చేసుకోవాలన్న చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చేదన్నారు.సర్వేపల్లి నెల్లూరులో కలపకుండా ఉండివుంటేముఖ్యంగా పేద బిక్కి ఉండే మా షెడ్యూల్డ్ కులాల ప్రజలు దూరం మాత్రమే కాదు ఆర్థికంగా భారం తో కూడుకున్న పని కావడంతో ఎంతో నష్ట పోయే వాళ్ళం అని అన్నారు.వెళ్లవలసిన అవసరం ఉండి వెళ్లలేని స్థితిలో ఉన్నవారిని నెల్లూరు అయితే ఎవరో ఒకరు సాయం చేసేవారని చెప్పారు.బాలాజీ జిల్లా అయితే ఒక రోజంతా కేటాయించాలన్న అంత డబ్బు ఖర్చు పెట్టాలని ఎవరు సహాయం చేయడానికి కూడా ముందుకు రాక అలాంటి పోయే వాళ్ళం అని అన్నారు.ఇటువంటి కష్టాలు అన్ని నుండి మమ్మల్ని గట్టెక్కించిన జగన్ అన్న గోవర్ధన్ అన్న ఇద్దరు మా పాలిట దేవుడు ఎన్ని జన్మలెత్తినా రుణం తీర్చుకోలేమన్నారు.మా అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమపడుతూ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న జగన్ అన్నకి నిత్యం మాకు అందుబాటులో ఉంటూ పిలిస్తే పలికే నేనున్నానంటూ అండగా నిలబడే మా గోవర్ధన్ అన్నకి కృతజ్ఞతాభివందనలు తెలియజేశారు.జై జగనన్న జై గోవర్ధన్ అన్న అంటూ నినాదాలు చేశారు.

# ముఖ్యమంత్రి రాకతో భారీ బందోబస్తు

**గోకవరం నుండి ఇందుకూరుపేట వరకు అడుగు అడుగున పోలీస్ లే**

**జిల్లా ఎస్పీ రవీంద్రబాబు, రంపచోడవరం ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ పరిశీలన**



గోకవరం, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాకతో పోలీస్ బలగాలు మోహరించాయి.. భారీ బందోబస్తు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.. ప్రధాన రహదారుల నిండా పోలీసులు పహారా కాస్తున్నారు.. పోలవరం పునరావాస కాలనీలు అన్ని పోలీస్ నీడలోకి వెళ్లాయి.. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు భద్రతా ఏర్పాట్లు చేశారు... శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గోకవరం, ఇందుకూరుపేట మధ్యలో పోలవరం పునరావాస కేంద్రానికి వస్తున్నారు.. అధికారుల సమాచారం ప్రకారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట మధ్యలో జరుగుతుంది.. గత నాలుగు రోజుల నుండి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ లతో పాటు రంపచోడవరం ఏఎస్పీ ఏర్పాట్లు పనిలో బిజీగా ఉన్నారు.. పోలీస్ యంత్రాంగం ఈ సమావేశాన్ని చాలా జాగ్రత్తగా పరిశీలిస్తుంది...ఇప్పటికే ముఖ్యమంత్రి వచ్చే రహదారులు అన్ని పోలీస్ భద్రతలోకి వెళ్ళిపోయాయి..గురువారం ఉదయం నుండి రోడ్లు పరిశీలనతో పాటు కల్వర్టులను తనిఖీ చేశారు.. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతానికి అన్ని వైపులా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.. నలువైపులా మూడు కిలోమీటర్ల మేర అన్ని ప్రదేశాలను ముమ్మర తనిఖీలు చేస్తున్నారు.. ఫజుల్లబాద్ వద్ద కొండలను క్షుణ్ణంగా పరిశీలించారు.. ఎవరైనా కొండ పైకి ఎక్కే అవకాశం ఉందా అనే విషయాలను గమనించారు.. ఇక్కడకు పహారా కాయటానికి వచ్చిన అన్ని రకాల బలగాలను కలుపుకుని చాలా ఎక్కువ సంఖ్యలో ఉండొచ్చు అని మాట్లాడుకుంటున్నారు.. జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు, రంపచోడవరం ఏఎస్పీ కృష్ణకాంత్ పటేల్ ప్రత్యేక పరిశీలన చేస్తున్నారు.. గోకవరం నుండి ఇందుకూరుపేట వెళ్లే రహదారి, గ్రామాల వద్ద ఎక్కడ చూసిన పోలీసులు భారీగా కనిపిస్తున్నారు..

# గౌతమ్ రెడ్డి ఉత్తరక్రియల బందోబస్తు

**ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ**

.ఉదయగిరి రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్రెడ్డి ఉత్తర క్రియలలో భాగంగా ఉదయగిరి మెరిట్స్ కళాశాలలో ఏర్పాటుచేసిన బందోబస్తు ఏర్పాట్లలో జిల్లా ఎస్పీ విజయ రావు గురువారం పరిశీలించారు.. ఈ సందర్భంగా దిగవంత గౌతమ్ రెడ్డికి ఘన నివాళులు అర్పించారు. దిగవంత గౌతమ్ రెడ్డి ఉత్తరక్రియల కార్యక్రమానికి పోలీసులు ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా యస్.పి. విఐపి గ్యాలరీ, నివాళులు అర్పించే క్యూ లైన్లు, బారికేడ్లు, భోజనాల వద్ద క్యూ లైన్లు, ట్రాఫిక్ మల్లింపు, వాహనాల పార్కింగ్ ప్రాంతాల సందర్శన, పలు సూచనలు చేశారు.పర్యటన పటిష్ట బందోబస్త్ నడుమ ప్రశాంతంగా నిర్వహించారు.సహకరించిన అన్ని విభాగాలు, ప్రజలు, నాయకులు, మీడియా మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. అప్రమత్తంగా బందోబస్తు, సమయానుకూలంగా ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహించిన సిబ్బంది నుండి అధికారుల వరకు ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపారు.దిగవంత మంత్రి కర్మ క్రతువుల కార్యక్రమంలో జిల్లా యస్.పి. విజయ రావు ప్రజా ప్రతినిధులు, ఇతర శాఖలు, జిల్లా పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## 3 రాజధానులు, సీఆర్డీఏ రద్దు పిటిషన్లపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ**

విజయవాడ3 రాజధానులు, సీఆర్డీఏ రద్దు పిటిషన్లపై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. సీఆర్డీఏ చట్ట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించాలని, ఒప్పందం ప్రకారం 6 నెలల్లో అభివృద్ధి పనులన్నీ పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. భూములిచ్చిన రైతులకు 3 నెలల్లో ప్లాట్లను అభివృద్ధి పరిచి అప్పగించాలని; రాజధాని అవసరాలకు తప్ప ఇతర అవసరాలకు భూమి తనఖా పెట్టడానికి వీల్లేదని హైకోర్టు స్పష్టం చేసిందని అయన అన్నారు.

## మహా శివ లింగేశ్వర జాతర కుస్తీ పోటీలు

తాండూరు వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గి గ్రామంలో మహాదేవ లింగేశ్వర మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా చివరిరోజు కుస్తీ పోటీలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుస్తీ పోటీలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి అలాగే పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతం నుండి కూడా ఎక్కువ సంఖ్యలో కుస్తీదారులు పోటీపడి పాల్గొన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా బషీరాబాద్ మండలం జీవన్గి కుస్తీ పోటీలకు ఎంతో ప్రత్యేకత ఉంటుందని పోటీదారులు పేర్కొన్నారు. కుస్తీ పోటీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాండూరు రూరల్ సీఐ జలంధర్ రెడ్డి ఎస్ ఐ విద్యా చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కుస్తీ పోటీలను నిర్వాహకులు గ్రామ పెద్దలు మాణిక్ రెడ్డి ఎంపీటీసీ నర్సింలు సర్పంచ్ నవనీత సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం కుస్తీ పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులను వెండి కడియాలు బహూకరించారు. ఈ కార్యక్రమానికి తాండూర్ డిఎస్పి లక్ష్మీనారాయణ రూరల్ సీఐ జలంధర్ రెడ్డి తెరాస సీనియర్ నాయకులు అజయ్ ప్రసాద్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం

విశాఖపట్నం రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అన్యాయం పై అఖిల పక్షాలు పోరాటానికి సిద్ధం అవుతున్నాయి. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో జిల్లాలలో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నారు. ఈ సందర్భంగా విశాఖ నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు పాల్గొని సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ నజీర్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న విశాఖ రైల్వే జోన్ కోసం పెద్ద ఎత్తున ధర్నా చేయతలపెట్టిన ట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి కేంద్రం చేస్తున్న అన్యాయం పై సదస్సులు, సమావేశాలు నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రానికి రాజధానిగా అమరావతి కి నిధులు కేటాయింపులో కేంద్రం అన్యాయం చేసిందని, అలాగే పోలవరం కి నిధులు కూడా డా.కె కేటాయించలేదని, కడప స్టీల్ ఫ్యాక్టరీ లేదని తెలిపారు. రాష్ట్రానికి కావలసిన నిధులపై కేంద్ర ప్రభుత్వం పై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలని పరిస్థితిలో ఉంది కాబట్టే ప్రధాని నరేంద్ర మోడీ నీ ఆంధ్ర రాష్ట్రం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వెల్లడించారు. కేంద్రంపై పోరాటానికి కలిసివచ్చే అందరిని కలుపుకొని ముందుకు వెళ్తామని అని తెలియజేశారు.

## ఏయూలో ఉద్రిక్తత

విశాఖపట్నం విశాఖ ఏయూ రణరంగాన్ని తలపించింది.ఏయూలో అక్రమాలు జరుగుతున్నాయంటూ పలు విద్యార్థి సంఘాలు చలో ఆంధ్రా యూనివర్సిటీ పిలుపునిచ్చింది.మరోవైపు ఇందుకు పోటీగా ఏయూ పరిరక్షణ పోరాట సమితి మహాధర్నాకు సిద్దమైంది. దీంతో యూనివర్సిటీ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు. యూనివర్సిటీ పరిసరాల్లో పోలీసులు 144 సెక్షన్ విధించారు. ఎటువంటి ఘర్షణ చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. యూనివర్సిటీకి చెందిన మూడు గేట్లను పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. గేట్ల గుండా కేవలం ఐడీ కార్డులు ఉన్నవారినే పోలీసులు లోనికి అనుమతిస్తున్నారు.ఏయూ పరిసరాలకు చేరుకుంటున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి సమీప పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. అయితే తాము ఎలాగైనా చలో ఏయూ చేపడతామని విద్యార్థి సంఘాల నాయకులు చెబుతున్నారు.ఆంధ్రా వర్సిటీలో ఎత్తివేసిన 20 కోర్సులను తక్షణమే పునరుద్దరించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.మరోవైపు విశాఖ ఆంధ్రా యూనివర్సిటికి పలు రాజకీయ నాయకులు ర్యాలీగా తరలిరావడంతో అలెర్ట్ అయిన పోలీసులు వారిని అరెస్టు చెయ్యడంతో ఏయూ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు తలెత్తాయి.

## ఇంటికి చేరుకున్న ఉక్రేయిన్ విధ్యార్థిని

ఏలూరు ఉక్రెయిన్ లో చిక్కుకుని ప్రభుత్వం తీసుకున్న ప్రత్యేక చొరవతో పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురం పట్టణం పదమూడో వార్డ్ కు చెందిన అనిశెట్టి ఉదయ కుమారి ఈరోజు ఉదయం నర్సాపురం చేరుకున్నారు. ఈ సందర్భంగా నరసాపురం బస్టాండ్ వద్ద ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆమెను యె?గ క్షేమాలు క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయ కుమారి రాకను కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఉదయ కుమారి ఉక్రెయిన్ లో తను పడిన ఇబ్బందులను మీడియాకు వివరించారు.

## వాలంటీర్లకు వ్యతిరేకంగా అందోళన

విశాఖపట్నం విశాఖ జిల్లా మల్కాపురంలో వాలంటీర్ల ఆగడాలు సృతిమించుతున్నాయి.వృధ్ధుల పెన్షన్ లో డబ్బులు కట్ చేస్తున్న వాలంటీర్లు తీరుపై వృద్దులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.క్రాంతినగర్ లో నెలనెల ఇచ్చే పెన్షన్ డబ్బులు నుండి చెత్త పన్ను వసూళ్ళు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.60 రూపాయుల వసూళ్ళ చేయడంతో గగ్గోలు పెడుతున్న వృద్ధులు, అంతటితో ఆగకుండా తెల్లకాగితంపై సంతకాలు తీసుకున్నారని చెబుతున్నారు.దీంతో సచీవాలయం ముట్టడించిన పెన్షన్ దారుల బంధువులు, వాలంటీర్ల ఆగడాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ పులిగొట్టు ఆంజనేయస్వామి పల్లకి మహోత్సవం

**ఏరిగేరి లో ముగిసిన శివరాత్రి వేడుకలు**

**భారీగా తరలి వచ్చి దర్శించుకున్న భక్తులు**

కౌతాళం మండల పరిధిలో ఏరిగేరి గ్రామంలో కొలువై న కొలిచే కొంగుబంగారం పలికే దేవుడు, భక్తులు అవసరాలను, కోర్కెలు తీర్చే ఆరాధ్యదైవం శ్రీ పులిగట్టు ఆంజనేయ స్వామి స్వామివారి పల్లకి మహోత్సవం అంగరంగ వైభవంగా గా అర్చకులు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. విద్యుత్ దీపాల అలంకరణ పూల అలంకరణ గ్రామ ప్రజలను అలరించాయి. అడుగడుగున మిఠాయి దుకాణాలు బొమ్మలు దుకాణాలు భారీగా కొలువై ఉన్నాయి. శ్రీ ఆంజనేయ స్వామి వారిని వివిధ నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి వారిని అనేక గ్రామాలు ప్రజలు దర్శించుకున్నారు.స్వామి పల్లకి మహోత్సవంలో అడుగడుగునా ప్రజలు భక్తులు స్వామివారిని కొలిచారు ఈ కార్యక్రమాలను వైసిపి నాయకులు నీలకంఠ రెడ్డి సర్పంచ్ గోవిందు అర్చకులు స్వామి ప్రత్యేక అవసరాలు నీటి వసతులు అన్నదాన కార్యక్రమలు కల్పించారు.

## రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు విద్యా రంగాన్ని ప్రోత్సహిస్తోంది



నంద్యాల మార్చి 3,( విభారె) :- రాష్ట్ర వ్యాప్త విద్యా పరిరక్షణ యాత్ర నంద్యాల వచ్చిన సందర్భంగా నంద్యాల పట్టణంలో పద్మావతి నగర్ అర్చ్ నుంచి మునిసిపల్ ఆఫీస్ దగ్గరీ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం సభ నిర్వహించడం జరిగిందని తెలిపారు .సభకు జిల్లా అధ్యక్షులు నీ.లక్ష్మణ్ అధ్యక్షత వహించారు .రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.నూతన జాతీయ విద్యా విధానం తీసుకువచ్చి పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం విద్యారంగంలో విస్తృతంగా మార్పులు చేసి ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహిస్తున్నది ఆవేదన వ్యక్తం చేశారు .పేదవారు ఉన్నత చదువులు చదవకుండా ఉండేందుకు పీజీ కి రియంబర్స్మెంట్ ను రద్దు చేసిందని చెప్పారు .కోట్ల రూపాయలు కాలేజీలకు బకాయిలు వున్నాయి దిక్కుతోచని స్థితిలో యాజమాన్యాలు అల్లాడిపోతున్నారని ఆ భారమంతా నేడు విద్యార్థులు భరిస్తున్నారని అన్నారు .యస్ యఫ్ ఐ .జి ల్లా కార్యదర్శి నిరంజన్ మాట్లాడుతూ.నంద్యాల జిల్లాలో ఉన్న ప్రభుత్వ కళశాలల్లో రోజు రోజుకు వసతులు తక్కువ అవుతున్నాయని వాటిని పటించుకోడంలో విద్యా అధికారులు రాజకీయ నాయకులు పూర్తిగా విఫలం అయ్యారని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా నాయకులు మధు,శివ నంద్యాల పట్టణ అధ్యక్షుడు తేజ,నాయకులు,ఉపాధ్యక్షులు సాయి,సహాయ కార్యదర్శి సాయి, కుమార్,నాయకులు,సూరత్,తదితరులు పాల్గొన్నారు.

## ఉర్దూ అకాడమీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

**ముస్లిం హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి యస్ యమ్ డి యూనుస్**

నంద్యాల మార్చి 3,( విభారె) :- నంద్యాల పట్టణంలో గురువారం నాడు ఓ ప్రకటనలో యూనుస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ అకాడమీ ఉ ద్యోగస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉర్దూ అకాడమీ లో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు గత ఐదు నెలల నుండి జీతాలు ఇవ్వకుండా వారిని మానసిక క్షోభకు రాష్ట్రప్రభుత్వం గురి చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు .ఎంతో సదాశయంతో అప్పట్లో ఉర్దూఅకాడమిని స్థాపించడం జరిగిందని ఉర్దూ భాష అభివృద్ధికి కృషి చేయటంతోపాటు పేద ముస్లింలకు కంప్యూటర్లో శిక్షణ ఇవ్వటానికి కంప్యూటర్ శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఎంత మంది నాయకులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

# కష్టపడుతున్నా కూడా ఫలితం శూన్యం



నంద్యాల మార్చి 3,( విభారె) :- . నంద్యాల నందనవనం చేయుటకు మున్సిపల్ కమిషనర్ ఉదయం నుంచి రాత్రి పొద్దు పోయే వరకు కష్టాలు పడుతున్న పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని పలువురు అంటున్నారు . గత రెండు మాసాల క్రితం ప్లాస్టిక్ కవర్స్ నంద్యాల లో కనపడకూడదని సాయ శక్తుల క్రిషి చేసారు కాని మూడు రోజుల హడావుడి తరువాత నెంబగించింది. ఇప్పుడు నంద్యాల యందు ఏక్కడ చూసిన కనిపిస్తున్నాయి . పుత్ పాత్ అక్రమాలపై ఉక్కు పాదం మోపుతామని టౌన్ ప్లానింగ్ అధికారులను ఇందుకు ఉపయోగించు కొని కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు . కాని ఆదిలోనే హంసపాదము ఎదురు అయినట్లు ఆపని పూర్తి స్థాయిలో జరగలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వచ్చేది ఎండకాలము నంద్యాల కు మంచి నీటి కొరత తీవ్రంగా ఉంది వెలుగోడు నుంచి పైపు లైన్ ఇంతవరకు పూర్తి కాలేదు. ఈ విషయం పై కమిషనర్ నీటి పారుదల శాఖ నిద్రపోతున్నారని వామపక్ష పార్టీలు విరుచుకుపడ్డారు కాని నీటి సరఫరా విషయంలో కమిషనర్ పెద్దగా పట్టించుకోలేవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు . వీధి దీపాలు సమస్యలపై కౌన్సిలర్లు అడిగితే అమరావతి నుంచి కాంట్రాక్టర్లు వస్తారని నా చేతుల్లో ఏమీ లేదని చెబుతున్నారని పలువురు అంటున్నారు . సిమెంటు రోడ్లు. మురికి కాలువలు సమష్యలపై పలువురు ప్రశ్నిస్తే మున్సిపాల్టీ యందు డబ్బులు ఉన్నాయి కానీ కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదన్నారు. ఇప్పుడు తడి..పొడి..చెత్తను విభజించి ఇవ్వండి అని ఏంత మోత్తుకున్న ప్రజలకు అవగాహన లేక ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారని తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు వాలంటీర్లు కౌన్సిలర్లు .అధికారులు క్రిషి చేయాలని కోరారు . మీ ఇంటివద్దకే.వాహనాలు..తోపుడు బండ్లు వస్తున్నాయి వాటిలోని చెత్త వేయండి అని చెప్పిన ప్రజలకు ఏంత చెప్పిన అర్థం కావడం లేదన్నారు. నవనందుల నంద్యాలను నందనవనం చేయాలంటే ప్రజాలసహకారం ఎంతో అవసరముందని ఆయన అన్నారు.

# ముమ్ముందు అన్ని గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేపడతా... నకేష్ రెడ్డి

## బడినేహాల్ గ్రామాన్ని రూపు రేఖలు మారుస్తాతండ్రి ఆశయాలను నెరువేరుస్తా

కౌతాళం మార్చి 3,( విభారె) బదినేహాల్ గ్రామ ముద్దుబిడ్డ, జనం మెచ్చిన నాయకుడు, శివారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత .నకేష్ రెడ్డి తాను జన్మించిన బదినేహాల్ గ్రామాన్ని అభివృద్ధి చేసి ఊరి రుణం తీర్చుకోవాలన్న సదుద్దేశంతో గ్రామాన్ని అభివృద్ధి పరుస్తున్న తీరు హర్షణీయమని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. నకేష్ రెడ్డి బదినేహాల్ గ్రామం పై మమకారంతో పంచాయతీ నిధులు అయితేనేమి, తన సొంత నిధులు శివారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ తరఫున గ్రామంలో ఎంతో అభివృద్ధి చేయడం జరుగుతోంది ఇప్పటికే గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందని అందులో తన తల్లి పేరుపై బి.జయలక్ష్మమ్మ మెమోరియల్ బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టడం జరిగిందని అలాగే వారి ముత్తాత పూజ్యులు శ్రీ శ్రీ రాహు సాహెబ్ తమ్మిరెడ్డి గారి జ్ఞాపకార్థం గ్రామ చావిడి ని ఆధునీకరించడానికి తన సొంత నిధులు ఆరు లక్షల రూపాయలు వెచ్చించి సిమెంట్ ప్లాస్టింగ్, గ్రానైట్, ఫ్యాన్లు, లైటింగ్ తో సుందరంగా తీర్చిదిద్దాలని పనులు ప్రారంభించడం జరిగింది. అలాగే గ్రామ చావిడి పై రెండు లక్షల రూపాయలను వెచ్చించి క్లాక్ టవర్ ను ఏర్పాటు చేయాలని పనులు ప్రారంభించడం హర్షించ దగ్గ విషయం అని గ్రామ ప్రజలు పేర్కొన్నారు. బదినేహాల్



గ్రామంపై అభిమానంతో ఎంతో అభివృద్ధి పరుస్తున్న నకేష్ రెడ్డి ని అలాగే శివారెడ్డి కుటుంబానికి బదినేహాల్ గ్రామ ప్రజలు ఎప్పటికీ సదా రుణపడి ఉంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం గురించి.నకేష్ రెడ్డి మాట్లాడుతు బదినేహాల్ గ్రామాన్ని రోల్ మోడల్ గా తీర్చిదిద్ది గ్రామ రుణాన్ని తీర్చుకుంటానని, తన తండ్రి ఆశయాన్ని ముందుకు తీసుకు పోతానని ముందు ముందు తమ సేవా కార్యక్రమాలను మండలంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి పనులు చేపడుతామని నకేష్ రెడ్డి పేర్కొన్నారు.

## దీర్ఘకాలిక వ్యాధులకు యోగా ద్వారా ఉపశమనం యోగ నిర్వాహకులు ఆనంద్ గురూజీ



నంద్యాల మార్చి 3,( విభారె):- నంద్యాల మున్సిపల్ పార్క్ నందు గల ఆయుష్ యోగా కేంద్రం లో నడుము నొప్పి సయాటికా లోయర్ బ్యాక్ పెయిన్ ఊబకాయం పొట్ట బెల్లి మరియు షుగర్ బిపి పక్షవాతము గుండె జబ్బు ఉన్నవారికి విడివిడిగా మాస్టర్ లతో యోగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని యోగా నిర్వాహకులు ఆనందగురుజీ తెలిపారు. ఈ సందర్భంగా ఆనంద్ గురించి మాట్లాడుతూ శిక్షణకు హాజరైన వారి సమస్యలను అడిగి తెలుసుకొని వైద్య పరీక్షలు నిర్వహించి విడివిడిగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు . కింద కూర్చుని చేయలేని వారి కోసం పెద్దవయసు వారి కోసం బల్లలు ఏర్పాటు చేయడమైనది అన్నారు. మానసిక ప్రశాంతత కొరకు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండుటకు ప్రతి ఆదివారం ఆటలు పాటలు జోక్స్ కోలాటం ఏరోబిక్ డాన్స్ నవ్వుల జల్లు కార్యక్రమాలు ఉంటాయన్నారు దీనితోపాటు ప్రతిరోజు ఆయు ఆరోగ్య కేంద్రంలో విటమిన్లు ప్రోటీన్లు మినరల్స్ కార్బోహైడ్రేట్స్ కూడిన ఎటువంటి పోషక విలువలు నశించకుండా ప్రకృతి సిద్ధమైన పండ్లు కూరగాయలు మొలకెత్తిన గింజలు డ్రై ఫ్రూట్స్ తో పాటు కూరగాయల రసాలు పండ్ల రసాలు ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఇస్తున్నట్లు పేర్కొన్నారు అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఉపశమనం కొరకు ప్రకృతి ఆశ్రమాలకు వెళ్లలేని ఆర్థిక స్తోమత లేని వారిని దృష్టిలో పెట్టుకొని యోగా శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈనెల 5వ తేదీ శనివారం నుండి నూతన ఉచిత యోగా శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయని అన్నారు. ఉదయం 5 గంటల 20 నిమిషాల నుండి ఆరు నెలల వరకు ఒక బ్యాచ్ ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు మరొక బ్యాచ్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలతో పాటు సమీప గ్రామాల ప్రజలు ఉపయోగించుకోవాలని ఆనంద్ గురించి తెలిపారు. హాజరు కాదలచిన వారు యోగ మ్యాట్ లేదా బెడ్ షీట్ వాటర్ బాటిల్ వెంట తెచ్చుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9989983673.9704019365 నంబర్లను సంప్రదించగలరు అని అన్నారు.

# శాటిలైట్ 'పునీత్'.. ఇదో అద్భుతం



కన్నడ సూపర్ స్టార్ పునీత్ రాజ్ కుమార్ మృతి నుండి అభిమానులు నెలలు గడుస్తున్నా కూడా తేరుకోలేక పోతున్నారు. ఆయన చేసిన సినిమాల ద్వారానే కాకుండా సేవా కార్యక్రమాల ద్వారా కూడా హీరో అయ్యాడు. అందుకే ఆయన మృతి చెందిన సమయంలో దేశ వ్యాప్తంగా ఆయన గురించి మాట్లాడుకోవడం జరిగింది. కన్నడ ముఖ్యమంత్రి స్వయంగా అంత్య క్రియలకు హాజరు అయ్యి దగ్గర ఉండి అన్ని కార్యక్రమాలు చూసుకున్నారు.కర్ణాటక ప్రభుత్వం పునీత్ రాజ్ కుమార్ కు మృతి చెందిన తర్వాత అత్యున్నత పురష్కారంను ఇచ్చారు. పునీత్ చనిపోయిన ఇన్ని నెలల తర్వాత ఆయన చివరి సినిమా జేమ్స్ విడుదలకు సిద్దం అయ్యింది. ఈనెలలో ఆయన మొదటి జయంతి సందర్బంగా జేమ్స్ ను భారీ ఎత్తున విడుదల చేసేందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ప్రకటించారు. ఇదే సమయంలో పునీత్ రాజ్ కుమార్ పేరుతో ఒక శాటిలైట్ ను కూడా తయారు చేస్తున్నట్లుగా ప్రకటించారు.పునీత్ రాజ్ కుమార్ జ్ఞాపకార్థంగా ఐటీబీటీ శాఖ తరపున ఒక శాటిలైట్ ను తయారు చేస్తున్నట్లుగా మంత్రి అశ్వత్థనారాయణ ప్రకటించాడు. ఇది పూర్తిగా కర్ణాటక విద్యార్థులు మరియు మేధావులు మాత్రమే తయారు చేస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయోగంలో 20 పాఠశాలకు చెందిన వారు పాల్గొనబోతున్నారు. రాష్ట్ర చరిత్రలో ఇదో ఒక గొప్ప విజయంగా నిలువబోతున్నట్లుగా మంత్రి పేర్కొన్నారు.ఐటీబీటీ శాఖ నుండి ఈ ప్రయోగం కోసం దాదాపుగా రెండు కోట్ల రూపాయలను విడుదల చేయబోతున్నట్లుగా ప్రకటించారు. సాదారణంగా అయితే ఒక శాటిలైట్ ను తయారు చేసేందుకు గాను కనీసం 50 లక్షల రూపాయలు ఖర్చు అవుతాయని అంటారు. కాని కన్నడ విద్యార్థులు కేవలం కేజీ బరువున్న శాటిలైట్ ను తక్కువ ఖర్చు తో తయారు చేస్తున్నట్లుగా చెబుతున్నారు.50 కేజీల బరువు ఉండే శాటిలైట్ ఎక్కువ ఖర్చు అవుతుంది. కాని కేవలం కేజీ బరువు మాత్రమే ఉండే శాటిలైట్ అవ్వడం వల్ల రెండు కోట్ల రూపాయలతోనే పూర్తి చేస్తున్నట్లుగా చెబుతున్నారు. ఈ శాటిలైట్ కు సంబంధించిన విషయాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. పునీత్ శాటిలైట్ అంటూ ఈ ఏడాదిలోనే నింగిలోకి ఈ శాటిలైట్ ఎగరబోతున్నట్లుగా మంత్రి ప్రకటించాడు. ఇది ప్రతి ఒక్క కన్నడ సినీ మరియు సాదారణ జనాలకు గర్వకారణం.

# పీకే రీమేక్ స్టార్ గా మారిపోయారా?

టాలీవుడ్ లో పవర్ స్టార్ పవన్ కల్యాణ్ రీమేక్ స్టార్ గా మారిపోయారా? అంటే ఇండస్ట్రీ వర్గాల్లో అవుననే సమాధానం వినిపిస్తోంది. కెరీర్ ప్రారంభం నుంచి పవర్ స్టార్ పవన్ కల్యాణ్ చేసిన ప్రతీ సినిమా దాదాపు రీమేక్ మూవీనే కావడం గమనార్హం. 'అక్కడ అమ్మాయి ఇక్కడబ్బాయి' సినిమాతో పవర్ స్టార్ కెరీర్ ప్రారంభించిన విషయం తెలిసిందే.ఇది బాలీవుడ్ రీమేక్ ఆధారంగా రూపొందింది. బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్ట్ అమీర్ ఖాన్ జూహీ చావ్లా నటించిన 'ఖయామత్ సే ఖయామత్' ఆధారంగా ఈ మూవీని తెలుగు నేటివిటీకి అనుగుణంగా మార్పులు చేసి తెరకెక్కించారు. ఈ మూవీ తరువాత క్యారెక్టర్



పరంగా కొత్తగా వుండాలని పవన్ చేసిన చిత్రం 'గోకులంలో సీత'. రాశి హీరోయిన్ గా నటించిన ఈ చిత్రాన్ని ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించారు. 1997లో వచ్చిన ఈ మూవీ పవన్ కు మంచి విజయాన్ని అందించి హీరోగా ఆయన కెరీర్ కి ప్లస్ గా మారింది. ఈ మూవీ కూడా రీమేకే కావడం విశేషం.తమిళంలో 'అభినందన' ఫేమ్ కార్తీక్ సువలక్ష్మి జంటగా నటించిన 'గోకులతిల్ సీతై' ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. అగస్త్యన్ దర్శకత్వం వహించారు. దీని తరువాత చేసిన 'సుస్వాగతం' పవన్ ని స్టార్ గా మార్చి యూత్ లో హ్యూజ్ క్రేజ్ ని క్రియేట్ చేసింది.పవన్ కల్యాణ్ కెరీర్ ని మలుపు తిప్పిన తొలి ప్రేమ 'బద్రీ' ఒరిజినల్ స్టోరీస్ కాగా ఆ తరువాత చేసిన 'తమ్ముడు' చిత్రాన్ని బాలీవుడ్ మూవీ 'జో జీతా వహీ సికందర్' స్ఫూర్తితో రూపొందించారు. ఈ మూవీ కూడా సెన్సేషనల్ హిట్ గా నిలిచి పవన్ కు యూత్ లో భారీ క్రేజ్ ఏర్పడేలా చేసింది. త బాయ్ నెక్స్ట్ డోర్ ఇమేజ్ ని అందించి యూత్ లో తిరుగులేని స్టార్ గా నిలబెట్టింది. ఇక 2001 లో వచ్చిన 'ఖుషీ' చిత్రం తమిళంలో స్టార్ హీరో విజయ్ నటించిన 'ఖుషీ' ఆధారంగా తెలుగులో రీమేక్ అయిన విషయం తెలిసిందే.ఇక 2006 లో వచ్చిన 'బంగారం' ఒరిజినల్ స్టోరీ కాగా 'అన్నవరం' తమిళ బ్లాక్ బస్టర్ 'తిరుపాచ్చి' ఆధారంగా తెరకెక్కింది. తమిళ చిత్రం తరహాలో తెలుగులో 'అన్నవరం' ఆకట్టుకోలేకపోయింది. జల్సా పులి ఒరిజినల్ స్క్రిప్ట్ లు కాగా 'తీన్ మార్' చిత్రాన్ని బాలీవుడ్ మూవీ 'లవ్ ఆజ్ కల్' ఆధారంగా రీమేక్ చేశారు. హిందీతో పోలిస్తే తెలుగు రీమేక్ ఆ స్థాయి విజయాన్ని అందుకోలేకపోయింది. ఇందులో తొలిసారి పవన్ కల్యాణ్ ద్విపాత్రాభినయం చేశారు.ఇక ఆ తరువాత పవన్ బ్లాక్ బస్టర్ హిట్ ని అందుకుంది మాత్రం మరో రీమేక్ మూవీ వల్లే కావడం గమనార్హం. 'పంజా' తరువాత పవన్ నటించిన చిత్రం 'గబ్బర్ సింగ్'. ఈ చిత్రాన్ని బాలీవుడ్ హిట్ చిత్రం 'దబాంగ్'కి రీమేక్ గా చేశారు. ఈ చిత్రం పవన్ కెరీర్ లోనే అత్యధిక వసూళ్లని రాబట్టిన చిత్రంగా రికార్డు సృష్టించింది.ఆ తరువాత చేసిన కెమెరామెన్ గంగతో రాంబాబు అత్తారింటికి దారేది చిత్రాలు ఒరిజినల్ స్క్రిప్ట్ లతో రూపొందాయి.

# పేరు సింపుల్ గా వున్నా వాడు సూపర్ మ్యాన్

మాస్ మహారాజా రవితేజ 'ఖిలాడీ' మూవీతో రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకొచ్చారు. భారీ అంచనాలతో విడుదలైన ఈ మూవీ అభిమానుల్ని ఆశించిన స్థాయి ఎట్రాక్ట్ చేయలేకపోయింది. యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ చిత్రంతో ఫ్యాన్స్ కి ట్రీట్ ఇవ్వాలనుకున్నారు కానీ కుదరలేదు. అయితే అది




'రామారావు ఆన్ డ్యూటీ'తో నెరవేరేలా కనిపిస్తోంది. మాస్ మహారాజా రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'రామారావు ఆన్ డ్యూటీ'. శరత్ మండవ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఎస్ ఎల్ వీ సినిమాస్ ఎల్ ఎల్ పీ బ్యానర్ పై సుధాకర్ చెరుకూరి అత్యంత భారీ స్థాయిలో నిర్మించారు.హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ గా తెరకెక్కిన ఈ మూవీలో 'జై భీమ్' ఫేమ్ రజీషా విజయన్ 'మజిలీ' ఫేమ్ దివ్యాన్ష కౌశిక్ హీరోయిన్ లుగా నటిస్తున్నారు. రవితేజ కూడా ఈ చిత్ర నిర్మాణంలో వన్ ఆఫ్ ది పార్ట్ నర్ గా వ్యవహరిస్తున్న ఈమూవీ రెండు పాటలు మినహా చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాల్లో వుంది. ఇదిలా వుంటే మేకర్స్ మహా శివరాత్రి సందర్భంగా అభిమానులకు టీజర్ రూపంలో సర్ ప్రైజ్ గిఫ్ట్ ని అందించారు.'రామారావు ఆన్ డ్యూటీ' టీజర్ ని మంగళవారం విడుదల చేశారు. ఈ చిత్రంలో పవర్ ఫుల్ డిప్యూటీ కలెక్టర్ పాత్రలో రవితేజ నటించారు. హై వోల్టేజ్ యాక్షన్ సన్నివేశాలతో టీజర్ మొదలైంది... పేరు సింపుల్ గా వున్నా వాడు సూపర్ మ్యాన్ అంటూ జాన్ విజయ్ చెబుతున్న డైలాగ్ లు ఆకట్టుకుంటున్నాయి. టీజర్ చూస్తుంటే మళ్లీ చాలా రోజుల తరువాత రవితేజ 'విక్రమార్కుడు' చిత్రంలో పోషించిన పవర్ ఫుల్ క్యారెక్టర్ విక్రమ్ రాథోడ్ తరహా పాత్రలో నటించినట్టుగా కనిపిస్తోంది.'ఆయుధం మీద ఆధారపడే నీలాంటి వాడి ధైర్యం వాడే ఆయుధంలో వుంటుంది... ఆయుధంలా బ్రతికే నాలాంటి వాడి ధైర్యం అణువణువునా వుంటుంది.. క్రిమినల్స్ విల్ బి పనిష్డ్ .. నో మ్యాటర్ వార్స్..ఈవెంటో దెరీజ్ నో ఎవిడెన్స్' అంటే రవితేజ చెబుతున్న పవర్ ఫుల్ డైలాగ్ లు సినిమా ఏ రేంజ్ లో మాస్ ఆడియన్స్ కు జాతరగా మారనుందో స్పష్టం చేస్తున్నాయి. లాకు వ్యతిరేకంగా వెళ్లే వాళ్లకు సింహస్వప్నం లాంటి సిస్సియర్ పవర్ ఫుల్ ఆఫీసర్ స్టోరీగా ఈ చిత్రాన్ని శరత్ మండవ తెరకెక్కించారు. చెడ్డ వాళ్లకు చెడ్డ వాడిగా .. మంచి వాళ్లకు మంచి వాడిగా నిలిచే రామా రావు కథేంటి? .. ఎందుకిలా వున్నాడు వంటి కారణాలు తెలియాలంటే సినిమా చూడాల్సిందే. పవర్ ఫుల్ యాక్షన్ సన్నివేశాలతో రూపొందించిన టీజర్ లో రవితేజ చాలా ఇంటెన్స్ గా పవర్ ఫుల్ లుక్ లో కనిపించి మాస్ ఆడియన్స్ ని ఆకట్టుకున్నారు. ఇద్దరు హీరోయిన్ లు కూడా టీజర్ లో చాలా హోమ్లీగా కనిపించారు. ఈ మూవీతో థర్డ్ ఇన్నింగ్స్ ని స్టార్ట్ చేస్తున్న హీరో వేణు టీచర్ లో చెప్పిన డైలాగ్ హీరో క్యారెక్టర్ ఎలా వుంటుందో స్పష్టం చేసింది. జాన్ విజయ్ తో 'రామారావు చాలా పితలాటకం మనిషి' అంటే వేణు చెప్పడం ఆకట్టుకుంటోంది. సత్యన్ సూర్యన్ ఫొటోగ్రఫీ శ్యామ్ సిఎస్ సంగీతం సినిమాకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి.

# శ్రీలంకతో తొలి టెస్టు.. యువ ఓపెనర్‌కు నో ఛాన్స్..!



స్వదేశంలో శ్రీలంకతో టీ20 సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసిన టీమిండియా.. ఇప్పుడు టెస్ట్ సిరీస్‌కు సిద్ధమైంది. మొహాలీ వేదికగా శుక్రవారం భారత్-శ్రీలంక మధ్య తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. ఇక సిరీస్‌కు కేఎల్ రాహుల్ గాయం కారణంగా దూరం కాగా, సీనియర్ బ్యాటర్లు రహానే,పుజారాలపై వేటుపడింది. గాయం కారణంగా కొన్నాళ్లుగా జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ జడేజా తిరిగి జట్టులోకి వచ్చాడు. ఈ నేపథ్యంలో శ్రీలంకతో జరిగే తొలి టెస్టుకు భారత ప్లేయింగ్ ఎలెవన్‌ను టీమిండియా మాజీ ఆటగాడు ఆకాష్ చోప్రా అంచనా వేశాడు.తన ప్రకటించిన జట్టులో కెప్టెన్ రోహిత్ శర్మ, మయాంక్ అగర్వాల్‌ను ఓపెనర్లుగా ఎంచుకున్నాడు. మూడు, నాలుగు స్థానాల్లో శ్రేయస్ అయ్యర్, విరాట్ కోహ్లికు అవకాశం ఇచ్చాడు. ఐదో స్థానంలో హనుమా విహారిను ఎంపిక చేశాడు. తన జట్టులో ఆరో స్థానంలో రిషబ్ పంత్, ఆల్‌రౌండర్ల కోటాలో రవీంద్ర జడేజాను ఎంచుకున్నాడు. తన జట్టులో ఏకైక స్పిన్నర్‌గా అశ్విన్ చోటు దక్కింది. ఫాస్ట్ బౌలర్ల కోటాలో జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమీ, సిరాజ్‌లకు చోటు ఇచ్చాడు. ఇక చోప్రా ప్రకటించిన జట్టులో యువ ఆటగాడు శుభమన్ గిల్‌కు చోటు దక్కలేదు. ఆకాశ్ చోప్రా ఎంచుకున్న భారత ప్లేయింగ్ ఎలెవన్: రోహిత్ శర్మ (కెప్టెన్), మయాంక్ అగర్వాల్, శ్రేయాస్ అయ్యర్, విరాట్ కోహ్లి, హనుమ విహారి, రిషబ్ పంత్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, మహ్మద్ షమీ, జస్ప్రీత్ బుమ్ సిరాజ్

## రష్యాకు మరో షాక్.. ఈ సారి పారాలింపిక్ కమిటీ

ఉక్రెయిన్‌పై దాడుల నేపథ్యంలో రష్యాపై యావత్ క్రీడా జగత్తు కన్నెర్ర చేస్తుంది. ఇప్పటికే ఆ దేశంపై ప్రముఖ ఫుట్‌బాల్ సంస్థలు ఫిఫా, జఇఈఅ బ్యాన్ విధించగా.. తాజాగా వింటర్ పారాలింపిక్ కమిటీ కత్తి దూసింది. 2022 వింటర్ పారాలింపిక్స్‌లో రష్యాతో పాటు బెలారస్ అథ్లెట్లు పాల్గొనకుండా అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ నిషేధం విధించింది. అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిళ్ల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు పారాలింపిక్ కమిటీ అధ్యక్షుడు ఆండ్రూ పార్సన్స్ తెలిపారు. రాజకీయాలతో క్రీడలకు ఎటువంటి సంబంధం లేనప్పటికీ, అనివార్య కారణాల వల్ల రష్యా, బెలారస్ పారా అథ్లెట్లను బహిష్కరించాల్సి వచ్చిందని ఆయన అన్నారు. ఇలా జరిగినందుకు చింతిస్తున్నామని పేర్కొన్నారు. ఆయా దేశ ప్రభుత్వాల చర్యలకు పారా అథ్లెట్లు బలైపోయారని వాపోయారు. కాగా, రేపటి (మార్చి 4) నుంచి బీజింగ్‌లో వింటర్ పారాలింపిక్స్ పోటీలు ప్రారంభంకానున్నాయి.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190